PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 233 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- మంగళవారం 18 ఆగస్టు 2026

### హెరిటేజ్, పెట్రోల్ బంకు పన్నులు మా పంచాయతీకే చెల్లించాలి


3లో

### సీబీఎస్ఈ ఖో- ఖో క్రీడా పోటీల్లో ఏకశిల విద్యార్థుల హవా



3లో

## విద్య, వైద్య రంగాలకు
# అత్యంత ప్రాధాన్యం

● ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి ● విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంది ● ఆరోగ్యశ్రీ కోసం రూ.2,600 కోట్లు ఖర్చు చేశాం ● గత పాలకులు టిమ్స్‌లకు కొబ్బరికాయలు కొట్టి వదిలేశారు ● వచ్చే ఏడాదికల్లా ఉస్మానియా సహా అన్ని ఆస్పత్రులు ప్రారంభిస్తాం ● కార్పోరేట్ స్థాయిలో ఆస్పత్రుల నిర్వహణ ● సనత్ నగర్ టిమ్స్ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్,ఆగస్టు 17(పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ ప్రజా పాలనలో విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో పాటు, రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పేదల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గత 32 నెలల్లో ఆరోగ్యశ్రీ కోసం రూ. 2,600 కోట్లు ఖర్చు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వ ఆస్పత్రుల సామర్థ్యాన్ని మరింత పెంచుతున్నామని తెలిపారు.తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆస్పత్రులు మిగతా2లో...

## కళ్యాణ,షాదీముబారక్
# కొనసాగుతుంది

● గత ప్రభుత్వం పక్కాగా అమలు చేయలేదు ● అందుకే కోర్టుల్లో కేసులు వచ్చాయి ● దీనిపై డివిజన్ బెంచ్‌కు అప్పీల్ చేస్తున్నాం

మీడియా సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి




హైదరాబాద్,ఆగస్టు 17(పిసిడబ్ల్యూ న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కళ్యాణ లక్ష్మి షాది, ముబారక్ గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కళ్యాణ లక్ష్మి పథకంపై వివరించారు. కళ్యాణ్ లక్ష్మి పథకం పై ఇప్పటివరకు జారీ చేసిన 8 జీవోలను ఒక పిటిషన్ హైకోర్టులో వేసిందన్నారు. అందులో భాగంగా ఈ పథకాన్ని ఆపాలని హైకోర్టు మధ్యంతర ఆదేశాలకు ఇవ్వడం జరిగింది. దీనిపై డివిజనల్ బెంచ్‌కు మిగతా2లో...

## 22ఎ భూములపై
# ఆందోళన వద్దు

● అధికారుల తప్పిదం వల్లనే ఇలా జరిగింది ● అందుకు ప్రజలను క్షమాపణలు కోరుతున్నాం ● నిషేధిత జాబితా నుంచి భూములను తొలగిస్తాం ● టోల్‌ఫ్రీ నంబర్ 18005994788కు సంప్రదించాలి ● ప్రజలను ఆఫీసులకు తిప్పే అధికారులపై చర్యలు తీసుకుంటాం ● మీడియా సమావేశంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి వివరణ



హైదరాబాద్,ఆగస్టు 17(పిసిడబ్ల్యూ న్యూస్): ప్రైవేటు వ్యక్తుల ఆస్తికి ఆటంకం కలిగించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రైవేటు భూమిని 22ఏలో పెట్టారంటూ మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి 750 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో పొంగులేటి మాట్లాడుతూ..అధికారుల పొరపాటు వల్ల ఇలా జరిగిందన్నారు. 22ఏ మిగతా2లో...

# తెలంగాణలో సర్ జాబితా విడుదల

- 78.30 శాతం ఎన్యూమరేషన్ పత్రాలు స్వీకరణ
- 2.73 శాతం మంది చనిపోయినవారిగా గుర్తింపు
- సుమారు 60 లక్షల మంది అనామలీస్ ఓటర్లు
- ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు అభ్యంతరాల స్వీకరణ
- అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల



2లో



# సుప్రీంలో రాహుల్‌కు ఊరట

- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో విచారణ నిలిపివేత

న్యూఢిల్లీ,ఆగస్టు 17(పిసిడబ్ల్యూ న్యూస్): కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంపై అలహాబాద్ హైకోర్టులో మిగతా2లో...

## డబ్బులు దండుకోవడానికే
# నిషేధిత జాబితా


- ప్రజల్లో గందరగోళం రేపిన 22ఎ జాబితా
- మీడియా సమావేశంలో ప్రభుత్వ తీరుపై హరీష్ ఆగ్రహం



హైదరాబాద్,ఆగస్టు 17(పిసిడబ్ల్యూ న్యూస్): రాష్ట్రంలో 22ఎ సెక్షన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా భూములను నిషేధిత జాబితాలో పెట్టి ప్రజలను తీవ్ర గందరగోళానికి, అయోమయానికి గురిచేస్తోందని.. బిఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. ఎవరి భూమి 22ఎలో ఉందో, ఎవరిది లేదో తెలియక రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారని మాజీ హరీశ్ రావు తెలిపారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. మిగతా2లో...

## భోగాపురం ఎయిర్‌పోర్టుకు
# తొలి విమానం రాక

- ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు



అమరావతి,ఆగస్టు 17(పిసిడబ్ల్యూ న్యూస్): భోగాపురం అల్లూరి సీతారామరాజు ఎయిర్‌పోర్టులో విమాన సర్వీసులు ప్రారంభం కావడంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మిగతా2లో...

# జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీ

2 లక్షల మందికి ఉపాధి కల్పనే లక్ష్యం

మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



హైదరాబాద్,ఆగస్టు 17(పిసిడబ్ల్యూ న్యూస్): జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులన్నీ 2028 మార్చి వరకు పూర్తి చేస్తామని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. 3,245 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న ఈ పారిశ్రామిక వాడకు రూ.15 వేల కోట్ల పెట్టుబడులు వచ్చేలా లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన చెప్పారు. సోమవారం నాడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయెల్ లు న్యూఢిల్లీ నుంచి నిర్వహించిన నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ వీడియో కాన్ఫరెన్సులో శ్రీధర్ బాబు సచివాలయం నుంచి వర్చువల్ గా పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పరిశ్రమల మంత్రులు ఈ వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. జహీరాబాద్ స్మార్ట్ సిటీలో పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభమైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా రెండు లక్షల మిగతా2లో...

## జార్ఖండ్ జంగ్.. 23వ రోజుకు
# విద్యార్థి ఆందోళన

- సీఎం సోరెన్, రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మల దహనం
- ఇక వ్యూహం మార్చుకుంటామన్న విద్యార్థి నేతలు
- సర్కార్ దిగిరాకపోతే.. సీఎం రాజీనామాకే డిమాండ్
- 20న ముఖ్యమంత్రి ఇంటి ముట్టడికి పిలుపు
- డిమాండ్లు నెరవేరుస్తారా.. రాజీనామా చేస్తారా
- జార్ఖండ్ సీఎంకు విద్యార్థుల హెచ్చరిక..
- హేమంత్, రాహుల్, తేజస్వీ యాదవ్ దిష్టిబొమ్మల దగ్ధం


2లో

# విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

పేదలకు ఎంతో ఉపయోగపడతాయని సీఎం అన్నారు. గత పాలకులు టిమ్స్ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనులను మర్చిపోయారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో మూడు టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణాన్ని వేగంగా చేపట్టామని తెలిపారు. అదే విధంగా వరంగల్‌లోనూ ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. 2027 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి ఆరు నెలలకు ఒక ఆస్పత్రిని ప్రారంభించే దిశగా ప్రణాళిక రూపొందించామని సీఎం వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తోందని తెలిపారు. ఆస్పత్రుల నిర్మాణ పనులు వేగంగా, నాణ్యతతో పూర్తయ్యేలా ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షణ చేపడుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.ప్రజా ప్రభుత్వం వ్యవసాయం, మహిళా సంక్షేమంతో పాటు విద్య, వైద్యాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుందని, మన బిడ్డలను ప్రపంచంలోనే గొప్ప స్థానాల్లో చూడాలని నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకున్నాం అని సిఎం అన్నారు. నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ, జపాన్ దేశాల్లోనూ అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈరోజుల్లో ప్రైవేటు వైద్యం అత్యంత ఖరీదుగా మారింది. అందుకే పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు టిమ్స్ ను ప్రారంభించుకున్నాం సీఎంఆర్‌ఎఫ్ కోసం రూ. 2526 కోట్లు ఖర్చు చేశాం. ఇప్పటి వరకు రూ. 5226 కోట్లు పేదల ఆరోగ్యం కోసం ఖర్చు చేశాం. రెండేళ్లలో రూ.21,800 కోట్లు వైద్య ఆరోగ్య శాఖ కోసం ఖర్చు చేశాం. ఉస్మానియా ఆసుపత్రి శిథిలావస్థకు చేరితే,. పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు కొత్త ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించాలని ప్రయత్నించలేదు.

టిమ్స్ ఆసుపత్రులు, వరంగల్ ఆసుపత్రికి కేవలం టెంకాయకొట్టి వదిలేశారు మేం అధికారంలోకి వచ్చాక సనత్ నగర్, ఎల్బీ నగర్, అల్వాల్ టిమ్స్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం అని సిఎం వివరించారు. ఇవన్నీ పూర్తయితే 10 వేల పడకల ఆసుపత్రులు అందుబాటులోకి వస్తాయి.2027, డిసెంబర్ 9 వరకు ఉస్మానియా, ఎల్బీ నగర్, అల్వాల్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేస్తాం. ఒక్కో ఆసుపత్రికి ఒక్కో డైరెక్టర్ ను నియమించి పర్యవేక్షిస్తాం కార్పొరేట్ తరహాలో ఆసుపత్రుల నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఆసుపత్రికి వచ్చే రోగుల అటెండెంట్ లు ఉండేదుకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తాం.ప్రభుత్వ ఆసుపత్రుల్లో అదనంగా సమయాన్ని కేటాయించే సూపర్ స్పెషాలిటీ వైద్యులకు ప్రోత్సహకాలను అందిచేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నానని అన్నారు. మేం టిమ్స్ ను ప్రారంభిస్తామని చెప్పగానే కొందరు పగటి వేషగాళ్లల్లా వచ్చి తిరిగి పోతున్నారు.కేటీఆర్ వచ్చి ఇది తామే కట్టామని చెప్పి వెళ్లారు. వెనక ఉన్న మెంటల్ హాస్పిటల్ కు వెళ్లి పేషంట్లకు టిమ్స్ లు కట్టింది నేనే నన్ను గుర్తుపట్టలేదా అని కేటీఆర్ అడిగాడట.అక్కడ ఉన్న రోగి ఊకో బిడ్డా నేను కూడా మొదట్లో అలాగే మాట్లాడేవాడిని.. రాను రాను వాడే తగ్గిపోతది అని చెప్పాడట.. మీరు కడితే పదేళ్లలో ప్రారంభించడానికి సమయం దొరకలేదా? మీ కుటుంబమే అధికారంలో వున్నపుడు ఎందుకు రిబ్బన్ కట్ చేయలేదు. మీరు ఎర్రవెల్లి, జన్వాడ, మొయినాబాద్, శంకర్ పల్లి ఫామ్ హౌసులు నిర్మించుకునేందుకు ఒక్క క్షణం కూడా ఆలస్యం కానివ్వలేదు. కానీ పేదలకు వైద్యం అందించే ఆసుపత్రులు పూర్తి చేయాలని ఆలోచన రాలేదా..ఇకనైనా ఆత్మ పరిశీలన చేసుకోండి.. నియోజకవర్గానికో పది, 20 కోట్లు ఖర్చు చేసి సేవ చేస్తే మీ పాపాలు కొంతైనా తగ్గుతాయని అన్నారు. కెసీఆర్, కేటీఆర్ 2034 వరకు మారకూడదని, ఇలాగే ఉండాలని కోరుకుంటున్నా.వాళ్లు అబద్దాలు చెప్పడం మానననంత కాలం నేను ఇలాగే నిజాలు చెబుతూనే ఉంటానని అన్నారు.మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ,షాదీముబారక్ కొనసాగుతుంది

(మొదటి పేజీ తరువాయి)

అప్పీల్ కై వెళుతున్నాము. సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నాం అని మంత్రి తెలిపారు. ఈ పథంలోని లొసుగులు ఏదైనా ఉంటే అది గత ప్రభుత్వం 2014లో చేసిన పొరపాటు వల్ల తలెత్తినది. అప్పుడు సరైన రీతులో ఉత్తర్వులు ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. తమ ప్రభుత్వం త్వరలో గత ప్రభుత్వం చేసిన అన్ని తప్పిదాలను సరిచేసి ఈ పథకం కొనసాగేలా చేస్తామన్నారు. గత ప్రభుత్వం పథకం లోప భూయిష్టమైన జీవోలు ఇవ్వడం వల్లే ఈ పథకం ఇలా అయిందన్నారు. కౌంటర్ ఫైల్ చేయడానికి అధికారుల లోపమా లేదా ప్రభుత్వంలో న్యాయపరమైన అంశాలు చూసే వారి లోపమా అని విచారణ చేస్తున్నాం.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెలంగాణ ప్రజలకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లు పేద కుటుంబాలకు అండగా నిలిచిన సంక్షేమ పథకాలని అన్నారు. పేదింటి ఆడబిడ్డ వివాహ సమయంలో కుటుంబంపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించడమే ఈ పథకాల ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. ఈ పథకాలను గత ప్రభుత్వం ప్రారంభించింది. రాజకీయాలకు అతీతంగా పేదల ప్రయోజనం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోంది. పేదలకు నష్టం కలగకుండా న్యాయపరంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను ప్రభుత్వం వినియోగిస్తుంది. రాజకీయ పిటిషన్లు పై ఈ పథకం ఎందుకు కొనసాగిస్తున్నారు అని స్టే ఇచ్చింది.. పథకాన్ని ఎత్తివేయలేదు..ఇది గత ప్రభుత్వ పథకం దీనిని ఎత్తివేయాలని మేము ఆలోచన చేయలేదు. గతంలో నిధులు కేటాయింపులకు సంబంధించిన ఇబ్బంది ఉన్న మేము వచ్చిన తర్వాత గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేసాం. వాళ్లు చేసిన అప్పులు.. దానిని తొలగించడానికి నిధుల సకాలంలో విడుదల చేయడానికి వ్యవస్థ ఏర్పాటు చేయలేదు.. పేద ల పిల్లల వివాహాలకు సామాజికంగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి ప్రభుత్వం బాసటగా ఉండాలని ప్రభుత్వం భావిస్తుంది. 12 తారీకు స్టే విధించింది.. వచ్చే నెల 9 వరకు అవకాశం ఉన్నప్పటికీ అప్పటి వరకు వెయిట్ చేయకుండా కోర్టులో స్టే తొలగించడానికి ముందుకు పోయాం.. రోడ్ల మీద నిరసనలు చేస్తున్న నాయకులకు చెప్తున్న మీరు చేసిన జీవోల వల్లే పథకానికి ఈ పరిస్థితి వచ్చింది. అయినా మేము కొనసాగిస్తున్నాం అన్నారు. బహుజన నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 జయంతి సందర్భంగా ట్యాంక్ బండ్ పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, పీసీసీ,మంత్రులు ,ఎమ్మెల్యేలు ,ఎమ్మెల్సీలు , ఎంపీలు, ప్రజా ప్రతినిధులు ,బలహీన వర్గాల నాయకులు ,కుల సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మొన్ననే ట్యాంక్ బండ్ పక్కన సామాజిక ఉద్యమ నాయకుడు మహాత్మా జ్యోతిబాపూలే సావిత్రి బాయ్ పూలే విగ్రహావిష్కరణ చేసుకున్నామని మంత్రి వివరించారు.

# డబ్బులు దండుకోవడానికే నిషేధిత జాబితా

(మొదటి పేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా 1999లోనే అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేశారు. మన రాష్ట్రంలో 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ చట్టాన్ని పూర్తిగా ఎత్తేశారు. కానీ ఆనాడు సీలింగ్ పరిధి నుంచి బయటపడి, క్లియర్ అయిన భూములను కూడా ఈ ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ తీసుకొచ్చి సీలింగ్ యాక్ట్ కింద 22ఎలో పెట్టడం ఏ రకమైన న్యాయం..ఈ ప్రభుత్వానికి కనీస అవగాహన, పాలనపై పట్టు లేదనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఏకంగా ఎయిర్‌పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్డు లాంటి ప్రభుత్వ భూములను కూడా 22ఎ నిషేధిత జాబితాలో పెట్టారంటే ఈ అధికారుల పనితీరు ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. హైదరాబాద్ నగరంలో లక్షలాది ప్రాపర్టీలను రాత్రికి రాత్రి ప్రొహిబిషన్ లిస్ట్‌లో చేర్చారు. శ్రీనగర్ కాలనీ సర్వే నంబర్ 8, 9లలో గత 20 ఏళ్లుగా ఇళ్లు కట్టుకుని ప్రశాంతంగా నివసిస్తున్న ప్రజల ప్రాపర్టీలను కూడా ఇప్పుడు 22ఎలో పెట్టడం దుర్మార్గం. 30 ఏళ్ల క్రితం కొనుక్కున్న అపార్ట్‌మెంట్ ఎలాట్లను కూడా నిషేధిత జాబితాలో పెడితే ఆ ప్రజలు ఇప్పుడు ఎక్కడికి పోవాలని హరీశ్ రావు ప్రశ్నించారు. తమ ప్రాపర్టీ 22ంలో ఉందన్న విషయం చాలామంది సామాన్యులకు తెలియడం లేదు. తీరా రిజిస్ట్రేషన్ కోసం చలాన్లు కట్టి, డబ్బులు చెల్లించిన తర్వాత.. చివర్లో మీ భూమి 22ఎ లో ఉందని చెప్పి రిజిస్ట్రేషన్ ఆపేస్తున్నారు. పైగా రిజిస్ట్రేషన్ కోసం కట్టిన చలాన్ డబ్బులు కూడా వాపస్ ఇవ్వకుండా ప్రభుత్వం ప్రజల సొమ్మును నిలువునా దోచుకుంటోందని మండిపడ్డారు. గతంలో ప్రభుత్వం నుంచి అధికారికంగా ఔక్షఅ వచ్చిన భూములకు బ్యాంకులు కూడా లోన్లు ఇచ్చాయి. ఇప్పుడు అవే భూములను తీసుకొచ్చి 22ఎ లో పెట్టడంతో అటు ప్రజలు, ఇటు బ్యాంకులు ఇద్దరూ ఆగం అవుతున్నారు. బంజారాహిల్స్ హౌసింగ్ సొసైటీ లాంటి ప్రాంతాలను సైతం ప్రొహిబిషన్ లో పెట్టారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు హరీశ్ రావు. 22ఎ అనేది ఈ ప్రభుత్వానికి ప్రజలను అడ్డగోలుగా దోచుకునే ఒక ఆయుధంగా మారిందన్నారు. రెవెన్యూ శాఖలో ఏ పని కావాలన్నా, 22ం నుంచి భూమిని బయటకు తీయాలన్నా 30 శాతం కమిషన్ ఇవ్వాలనేది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. 30 శాతం కమిషన్ లేనిదే రెవెన్యూ శాఖలో ఒక్క ÷ల్ కూడా కదలడం లేదు. చివరికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఎ ప్రొహిబిషన్ లిస్ట్‌లో ఉందంటే ఆశ్చర్యం కలుగుతోంది. తన సొంత ఇంటికి సెగ తగిలే సరికి ప్రభుత్వంలో హడావిడి మొదలైందన్నారు హరీశ్ రావు. మీకు చురుకు తగిలితేనే కానీ సామాన్యుల బాధలు పట్టవా.. ? స్వయంగా ముఖ్యమంత్రి పరిస్థితే ఇలా ఉంటే, ఇక రాష్ట్రంలో సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి..? వాళ్ల గోడు ఎవరు వినాలి. హంతకుడే సంతాప సభ పెట్టినట్లు ఉంది ఈ ప్రభుత్వ తీరని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. ముందు అడ్డగోలుగా భూములను 22ఎలో వేయడం, ఆ తర్వాత దాన్ని సరిచేయడానికి జీవోలు తెస్తాం, రివ్యూలు చేస్తాం అని డ్రామాలు ఆడటం ఎందుకు.. తప్పు జరిగినప్పుడు తక్షణమే ఆ భూములను 22ం నుంచి తొలగించాలి కానీ.. ఈ రివ్యూల పేరుతో కాలయాపన చేయడం వెనుక ఉన్న ఆంతర్యం ఏంటి..? కమిషన్ల కోసమేనా..? అసలు ఈ ప్రాపర్టీలను అందులో ఎవరు పెట్టారు? కమిషన్లు తీసుకుని ఎవరు తొలగిస్తున్నారు..? దీనిపై తక్షణమే విచారణ జరగాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 7, 2023 నుంచి భూములను ప్రొహిబిషన్ లిస్ట్ లో పెట్టి న వివరాలు ప్రభుత్వం వెంటనే వైట్ పేపర్ విడుదల చేసి నిజాలను ప్రజల ముందు ఉంచాలి. అప్పటిలోగా ఈ ఆస్తులన్నింటినీ దాని పరిధి నుంచి మినహాయించాలన్నారు .

# తెలంగాణలో సర్ జాబితా విడుదల

**హైదరాబాద్,ఆగస్టు 17(పిసిడబ్ల్యు న్యూస్):** తెలంగాణలో రాష్ట్ర ఎన్నికల సంఘం సర్ ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. సర్ పక్రియలో మొదటి భాగం పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 78.30 శాతం ఎన్యూమరేషన్ పత్రాలు అందినట్లు తెలిపారు. 2.73 శాతం మంది చనిపోయినవారిగా గుర్తించినట్లు సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. మరోవైపు సుమారు 60 లక్షల మంది అనామలీస్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. అలాగే 32 లక్షల మంది ఓటర్లు మ్యాపింగ్ చేసుకోలేదని గుర్తించారు. ఈ నేపథ్యంలో సుమారు 92 లక్షల మందికి నోటీసులు జారీ చేయనున్నట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

నోటీసులు అందుకున్న ఓటర్లు సంబంధిత పత్రాలను సమర్పించి తమ వివరాలను నిర్ధారించు కోవాలని సూచించారు. నోటీసులు అందుకున్న వారు వీలైనంత త్వరగా స్పందించాలని కోరారు.

ఏ కారణంతో నోటీసు జారీ చేశామో స్పష్టంగా తెలియజేస్తామని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఓటు తొలగింపుపై అభ్యంతరాలు ఉన్నవారు తమ అభ్యంతరాలను సమర్పించవచ్చని పేర్కొన్నారు.

ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు అభ్యంతరాలు, సంబంధిత దరఖాస్తులను పరిశీలించనున్నట్లు సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు.

పరిశీలన పక్రియ పూర్తయిన అనంతరం అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. సర్ పక్రియను పూర్తి చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 2 వేల మందికి పైగా అధికారులు పాల్గొంటారని సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. ఎవరి ఓట్లు అయినా లేకపోతే ఫారం 6ఏ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ముసాయిదా జాబితాను ఎన్నికల అధికారులు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

# సుప్రీంలో రాహుల్‌కు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగుతున్న విచారణను తదుపరి ఆదేశాలు వచ్చే వరకు నిలిపివేయాలని ఆదేశించింది. అలాగే ఈ కేసులో సీబీఐ, ఈడీ ఎలాంటి నివేదికను ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టుకు సమర్పించకూడదని స్పష్టం చేసింది. రరాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చి, వి. మోహనాలతో కూడిన ధర్మాసనం విచారించింది. అలహాబాద్ హైకోర్టు ఇప్పటికే ఈ కేసులో తదుపరి విచారణను ఆగస్టు 20న చేపట్టనుంది. అయితే హైకోర్టు విచారణను తదుపరి ఆదేశాల వరకు వాయిదా వేయాలని తాజాగా సుప్రీంకోర్టు ఆదేశించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తమ దర్యాప్తు లేదా పరిశీలనకు సంబంధించిన ఎలాంటి నివేదికను హైకోర్టుకు సమర్పించకుండదని పేర్కొంది. రాహుల్ గాంధీ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త విఘ్నేశ్ శిశిర్ చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ వ్యవహారం అలహాబాద్ హైకోర్టుకు వెళ్లింది. రాహుల్ గాంధీ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలను పరిశీలించాలని సీబీఐ, ఈడీకి హైకోర్టు గతంలో సూచించింది. ఈ ఆదేశాలను రాహుల్ సుప్రీంలో సవాల్ చేశారు. అంతేకాకుండా ఈ కేసు విచారణను అలహాబాద్ హైకోర్టు నుంచి ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలని ప్రత్యేక పిటిషన్ కూడా దాఖలు చేశారు.

# భోగాపురం ఎయిర్‌పోర్టుకు తొలి విమానం రాక

(మొదటి పేజీ తరువాయి)

సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా స్పందించారు. చరిత్రాత్మక ఘట్టానికి భోగాపురం వేదికైందన్నారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో నేటి నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. హైదరాబాద్ నుంచి తొలి ఇండిగో విమానం భోగాపురం విమానాశ్రయానికి చేరుకుందన్నారు. తొలి విమానం రాకతో ఏపీ.. కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఉత్తరాంధ్రకు మెరుగైన విమాన కనెక్టివిటీ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. భోగాపురం విమానాశ్రయం.. రాష్ట్రంలో కొత్త అవకాశాలకు బాటలు వేస్తోందని సీఎం చెప్పుకొచ్చారు. యువత ఆశలు, ఆకాంక్షలకు ఈ విమానాశ్రయం రెక్కలు తొడుగుతుందని.. విద్య, ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలకు మరింత ఊతమిస్తుందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం ఎయిర్ పోర్టు కీలకంగా మారనుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చరిత్రాత్మక కొత్త ఆరంభమని.. ఉత్తరాంధ్రకు కొత్త గేట్‌వేగా అవతరించనుందని తెలిపారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభంతో ఏపీ కొత్త శకానికి నాంది పలికిందని సీఎం వెల్లడించారు.

# 22ఎ భూములపై ఆందోళన వద్దు

(మొదటి పేజీ తరువాయి)

భూములపై నాలుగు జిల్లాల్లోని అధికారులతో కలిసి చర్చించాం. గతంలో ఆ భూములు యూఎల్‌సీ జాబితాలో ఉన్నాయి. నిషేధిత జాబితాను అప్‌డేట్ చేయడంలో పొరపాటు జరిగిందన్నారు. అధికారుల తరపున క్షమాపణలు కోరుతున్నానని మంత్రి అన్నారు. ప్రైవేట్ ఆస్తుల్ని 22ఏ జాబితా నుంచి త్వరలోనే తొలగిస్తాం. దీనికి సంబంధించి ఫిర్యాదులు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 18005994788కు సంప్రదించాలన్నారు. భూములకు సంబంధించి అన్నీ సక్రమంగా ఉన్నవారు ఆందోళన చెందవద్దని పొంగులేటి అన్నారు. 22ఎ వల్ల ఇబ్బంది పడుతున్న ప్రజలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పారు. దీన్ని బూచిగా చూపి ప్రజలను ఆఫీస్‌ల చుట్టూ తిప్పితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వ్యవహారంలో సత్వర కేసుల పరిష్కారం కోసం ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. జెన్యూన్ కేసుల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 18005- 994788కి ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. మేడ్చల్ జిల్లాలో అత్యధికంగా 511 అప్లికేషన్లు, రంగారెడ్డి జిల్లాలో 146 అప్లికేషన్లు వచ్చాయి. హైదరాబాద్‌లో 49, సంగారెడ్డిలో 38 అప్లికేషన్లు వచ్చాయి. ప్రైవేటు భూమిని 22-ఎ కింద పెట్టారని 757 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇవన్నీ 22-ఎ జాబితాలోకి ఎందుకు వచ్చాయనే అంశంపై చర్చించాం. ప్రైవేటు ఆస్తుల యజమానులను ఇబ్బందిపెట్టాలనే ఉద్దేశం మాకు లేదు. గ్రౌండ్ రియాలిటీ ఎలా ఉందనే అంశంపై సమీక్షించాం. న్యాయంగా ఉన్నవాటిని త్వరలోనే నిషేధిత జాబితా నుంచి తొలగిస్తాం'.. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. కోర్టులకు వెళ్లాల్సిన పనిలేదు. అధికారులకు అప్లికేషన్స్ ఇస్తే చాలని మంత్రి వివరించారు. న్యాయబద్ధమైన మీ ఆస్తులకు తొందరగా క్లియరెన్స్ అభిస్తుంది. ప్రజలు ఆందోళన చెందవద్దు. కొన్ని ప్రాంతాల్లో అధికారుల తప్పిదాలను గుర్తించాం. కోర్టు ఆదేశాలను ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేయకపోవడం వల్లే సమస్య ఏర్పడింది. అధికారుల తప్పిదాలను సవరణ చేస్తున్నాం. నిజమైన కేసులు త్వరలోనే పరిష్కారం అవుతాయని అన్నారు.

# జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీ

(మొదటి పేజీ తరువాయి)

మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని శ్రీధర్ బాబు వివరించారు. ఈ స్మార్ట్ సిటీలో భూమి రూపంలో రాష్ట్ర ప్రభుత్వం వాటా 51 శాతం ఉండగా, కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి పనులకు నిధులు అందజేస్తోంది. ఇప్పటికే స్పెషల్ పర్పస్ వెహికల్ కు అభివృద్ధి ప్రణాళికను అందజేసినట్టు శ్రీధర్ బాబు తెలిపారు. ఇంజనీరింగ్, ప్రొక్యూర్ మెంట్, కన్ స్ట్రక్షన్ (ఇపిసి) పద్ధతిలో జరగుతున్న పనులు ముందుగా నిర్ణయించిన సమయానికి పూర్తవుతాయిని శ్రీధర్ బాబు వెల్లడించారు. నీటి సరఫరా పనుల టెండర్ల పక్రియ పూర్తయిందని చెప్పారు. విద్యుత్తు సరఫరా పనులను కూడా గడువులోగా పూర్తి చేస్తామని వివరించారు. భవ్య పథకం కింద కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 100 ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల్లో నాలుగింటిని తెలంగాణాకు కేటాయించాలని మంత్రి పీయూష్ గోయెల్ ను కోరారు. వీడియో కాన్ఫరెన్సులో టిజిఐఐసి ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య, పరిశ్రమల కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# జార్ఖండ్ జంగ్.. 23వ రోజుకు విద్యార్థి ఆందోళన

**రాంచి :ఆగస్టు 17(పిసిడబ్ల్యు న్యూస్):** జేపీఎస్‌సీ-జేఎస్‌ఎస్‌సీ విద్యార్థుల నిరసనలు ఆదివారంతో 23వ రోజుకు చేరుకున్నాయి. విద్యార్థులు తమ నిరసనల వ్యూహాన్ని మార్చుకుంటున్నట్టు ప్రకటించారు. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే సీఎం హేమంత్ సోరెన్ రాజీనామాను కోరుతామని హెచ్చరించారు. అంతే కాకుండా ఆగస్టు 20న సీఎం ఇంటికి మార్చ్ నిర్వహిస్తామని ప్రకటించారు. దీంతో నిరసనలు మరో మలుపు తిరిగాయి. ఆగస్టు 10న నిర్వహించిన అసెంబ్లీ మార్చ్‌లో విద్యార్థులపై పోలీసులు వాటర్ కానన్లు, టియర్ గ్యాస్ వినియోగించడంతో పాటు లాఠీ చార్జ్ చేయడంతో అప్పటి నుంచే నిరసనలు మరింత ఉధృతంగా మారాయి. ఈ నిరసనలకు నాయకత్వం వహిస్తున్న వారిలో ఒకరైన పియూష్ సింగ్ మాట్లాడుతూ స్టూడెంట్లు నాలుగు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచినట్టు చెప్పారు.జేఎస్ఎస్‌సీ-సీజీఎల్ పరీక్షను రద్దు చేయడం, జేపీఎస్‌సీ 11వ, 13వ పరీక్షలను రద్దు చేయడంతో పాటు టీడీపీఎల్ సంస్థతో సంబంధం ఉన్న అన్ని పరీక్షలను రద్దు చేసి ప్రస్తుతం జరుగుతున్న విచారణలను సీబీఐకి అప్పగించాలని కోరుతున్నారని వెల్లడించారు. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే ఆగస్టు 20న అసలు సినిమా ఉంటుందన్నారు. సీఎం రాజీనామాను కోరుతామని హెచ్చరించారు. అయితే జేపీఎస్‌సీకి సంబంధించిన మూడు పరీక్షలను రద్దు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ సీజీఎల్ కు సంబంధించిన పరీక్షను రద్దు చేయడం కుదరదని.. అది కోర్టుల పరిధిలో ఉందని ఓ మంత్రి పేర్కొన్నారు. సీఎం ఇల్లు ముట్టడి ప్రకటన నేపథ్యంలో పోలీసులు ఆయన ఇంటి వద్ద భారీ భద్రతా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.

# సీబీఎస్ఈ ఖో- ఖో క్రీడా పోటీల్లో
# ఏకశిల విద్యార్థుల హవా

**బాలుర ఏపీ, తెలంగాణ సీబీఎస్ఈ క్లస్టర్ పోటీల్లో ప్రథమ స్థానం**

**ఇదివరకే ప్రథమ స్థానంతో సత్తా చాటిన బాలికలు**

**విజేతలను ప్రశంసించిన చైర్మన్ గౌరు తిరుపతి రెడ్డి**




**వరంగల్ ఆగస్టు 17(పిసిడబ్ల్యూ న్యూస్):** ఏపీ, తెలంగాణ సీబీఎస్ఈ క్లస్టర్7 ఖో-ఖో ఛాంపియన్‌షిప్ బాలుర విభాగంలో ఐనవోలు మండలం పున్నేలుకు చెందిన ఏకశిల హై స్కూల్ బాలుర జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. మెదక్ జిల్లా తూప్రాన్ లోని ఒలంపియా పాఠశాలలో ఈ నెల 8 నుంచి 10 వరకు జరిగిన ఖో-ఖో క్లస్టర్ పోటీల్లో 12 మందితో ఏకశిల హైస్కూల్ జట్టు పాల్గొంది. మొత్తం పోటీల్లో 84 జట్లు తలపడగా అద్భుతమైన ఆటతీరు కనబరిచిన ఏకశిల హైస్కూల్ బాలుర జట్టు విజయకేతనం ఎగురవేసి ప్రథమ స్థానంలో నిలిచారు. కాగా గత కొన్నిరోజుల క్రితం ఇదే పోటీల్లో ఏకశిల బాలికల జట్టు పాల్గొని ప్రథమ స్థానంలో నిలవడం గమనార్హం. ఈ ఘనతను సాధించిన సందర్భంగా విజేతలను ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతి రెడ్డి షీల్డు లు అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపడం హర్షనీయమన్నారు. కాగా 24 మంది విద్యార్థులతో కూడిన రెండు జట్లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. తమిళనాడులోని కాంచీపురం వీలమ్మల్ విద్యాలయ, సినీర్ కుప్పంలో సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 4 వరకు జరిగే జాతీయ స్థాయి సీబీఎస్ఈ పోటీల్లో జట్లు పాల్గొంటాయని ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూఏకశిల విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించేలా తీర్చిదిద్దుతున్నామన్నారు. అందుకు అనుగుణంగానే ఉన్నతస్థాయి ప్రమాణాలను పాటిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.డి. బాబా,వైస్ ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్ , ఇంచార్జి వ్యాయామ ఉపాధ్యాయుడు నర్సయ్య, కోచ్ రజినీకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హెరిటేజ్, పెట్రోల్ బంకు పన్నులు మా పంచాయతీకే చెల్లించాలి

**రెవెన్యూ పరిధిని తేల్చి న్యాయం చేయాలి: గోకవరం సర్పంచ్ గుగులోతు శ్రీను**

**ఆరు నెలలుగా అధికారుల చుట్టూ తిరిగినా స్పందన లేదంటూ ప్రజావాణిలో ఫిర్యాదు**



**కల్లూరు, ఆగస్టు 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మండలం గోకవరం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న హెరిటేజ్ పాల ఉత్పత్తుల సంస్థ, పెట్రోల్ బంకు ఏ రెవెన్యూ పరిధిలో ఉన్నాయో సమగ్రంగా విచారించి స్పష్టత ఇవ్వాలని గోకవరం గ్రామ సర్పంచ్ గుగులోతు శ్రీను ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఆయా సంస్థలకు సంబంధించిన పన్నులు ఏ గ్రామపంచాయతీకి చెల్లించాలనే అంశాన్ని అధికారులు తేల్చి, న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీను మాట్లాడుతూ.. హెరిటేజ్ పాల ఉత్పత్తుల సంస్థ, పెట్రోల్ బంకు ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణతో పాటు అవసరమైన మెయింటెనెన్స్ పనులను గోకవరం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలోనే చేపడుతున్నామని తెలిపారు. అయితే వాటికి సంబంధించిన ట్యాక్స్ మాత్రం కొర్లగూడెం గ్రామపంచాయతీకి చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పారిశుద్ధ్య పనులు తమ గ్రామపంచాయతీ సిబ్బందితో చేయిస్తూ, పన్నుల ఆదాయం మాత్రం మరో పంచాయతీకి వెళ్లడం వల్ల గోకవరం గ్రామపంచాయతీకి నష్టం జరుగుతోందని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ విషయంపై గత ఆరు నెలలుగా తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లను పలుమార్లు కలిసి సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని కోరినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీంతో ప్రజావాణిలో అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్లు తెలిపారు. హెరిటేజ్ సంస్థ, పెట్రోల్ బంకు ఉన్న భూములు వాస్తవంగా ఏ రెవెన్యూ పరిధిలో ఉన్నాయో, ఏ గ్రామపంచాయతీ పరిధికి చెందుతున్నాయో అధికారికంగా నిర్ధారించాలని కోరారు. అలాగే ఆయా ప్రాంతాల పారిశుద్ధ్యం, నిర్వహణ బాధ్యతలు ఏ పంచాయతీ పరిధిలో ఉంటాయో నిర్ణయించి, దానికి అనుగుణంగా పన్నులు కూడా అదే గ్రామపంచాయతీకి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని ప్రజావాణిలో ఎంపీడీవో చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సర్పంచ్ శ్రీను తెలిపారు. దీనిపై మండల పంచాయతీ అధికారి సమగ్ర విచారణ జరిపి, రెవెన్యూ రికార్డులు పరిశీలించి వాస్తవాలను నిర్ధారించి తగిన విధంగా న్యాయం చేస్తారని అధికారులు హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.రెవెన్యూ రికార్డుల ఆధారంగా తక్షణమే విచారణ పూర్తి చేసి, పన్నుల విషయంలో నెలకొన్న గందరగోళానికి తెరదించి గోకవరం గ్రామపంచాయతీకి న్యాయం చేయాలని సర్పంచ్ గుగులోతు శ్రీను కోరారు.

# కళ్యాణలక్ష్మి పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తున్నారు

**ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి**

**మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య**





**కల్లూరు, ఆగస్టు 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :**ప్రజా వ్యతిరేక విధానాలపై నేడు నిర్వహించ తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య పిలుపునిచ్చారు. సోమవారం కల్లూరుపట్టణంలోని మున్సిపల్ కౌన్సిలర్ బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు ప్రతాప్ ల్యాబ్ అధినేత పెడకంటి రామకృష్ణ మీటింగ్ హాల్ నందు నిర్వహించిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సండ్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎత్తివేసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.తెలంగాణ ఉద్యమ సమయంలో నిరుపేదల కష్టాలను కళ్లారా చూసిన కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల హామీలో లేకపోయినా మానవతా దృక్పథంతో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని సండ్ర వెంకట వీరయ్య గుర్తుచేశారు. మొదట రూ.50 వేలతో ప్రారంభించిన ఈ పథకాన్ని అనంతరం రూ.1,00,116లకు పెంచి పదేళ్లపాటు పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా నిలిచారని అన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించడంపై నిర్లక్ష్యం వహిస్తోందని సండ్ర ఆరోపించారు. ఎన్నికల సమయంలో రూ.1,00,116తో పాటు తులం బంగారం, రైతు బంధు పెంపు వంటి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు ఆ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. కళ్యాణలక్ష్మి పథకంపై హైకోర్టులో స్టే వచ్చినప్పటికీ ప్రభుత్వం వారాలు గడుస్తున్నా కౌంటర్ దాఖలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తోందని సండ్ర మండిపడ్డారు. ప్రభుత్వ అలసత్వం కారణంగా పేదలు, మైనార్టీ వర్గాల కుటుంబాలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించి పేద కుటుంబాలకు అండగా నిలవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్లు సండ్ర వెంకట వీరయ్య తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య జన్మదిన వేడుకను పురస్కరించుకొని బిఆర్ఎస్ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్,సొసైటీ మాజీ చైర్మన్ కాటమనేని వెంకటేశ్వరరావు, సొసైటీ మాజీ చైర్మన్ పెద్ద బోయిన మల్లేశ్వరరావు, మాజీ జడ్పిటిసిలు లక్కినేని రఘు, మేకల కృష్ణ, కౌన్సిలర్ బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు పెడకంటి రామకృష్ణ, దార్ల నరసింహారావు, సయ్యద్ ఇంతియాజ్, మహమ్మద్ ఇస్మాయిల్, గ్రామ సర్పంచ్ వేము కృష్ణ, కొరకు ప్రసాద్,మాజీ వార్డ్ సభ్యులు సీనియర్ నాయకులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఉబ్బన వెంకటరత్నం, రావుఫ్, కట్ట ఆర్లప్ప, కళ్యాణ్ కిషోర్, చారుగుండ్ల సందీప్, బొల్లం వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిటిసి బాలు, అజ్మీర జములయ్య, జానీ మియా, సిహెచ్ కిరణ్, నాయకులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి

**● పరకాల బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గొట్టే అజయ్ డిమాండ్**



**పరకాల, ఆగస్టు 17 (పిసీడబ్ల్యూ న్యూస్):** కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయకుండా కొనసాగించాలని పరకాల బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గొట్టే అజయ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఈ పథకాలు ఆర్థికంగా అండగా నిలుస్తున్నాయని తెలిపారు.ఆడబిడ్డ వివాహం తల్లిదండ్రులకు ఆర్థికంగా ఎంతో భారంతో కూడుకున్న విషయమని, ఇలాంటి సమయంలో ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం ఆ కుటుంబానికి ఎంతో భరోసా కల్పిస్తుందని అన్నారు. కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా అందే సహాయం పేద కుటుంబాలకు ప్రభుత్వ భరోసాకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. తనకు కూడా ఈ పథకం ద్వారా అందిన సాయం ఎంతో విలువైనదిగా భావిస్తున్నానని తెలిపారు.ఈ పథకాలను నిలిపివేయడం లేదా వాటి అమలులో జాప్యం చేయడం వల్ల వేలాది పేద కుటుంబాల ఆడబిడ్డలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని అజయ్ పేర్కొన్నారు. ఒక ఇంటి ఆడబిడ్డ వివాహానికి ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని దూరం చేయడం అంటే ఆ కుటుంబంపై అదనపు ఆర్థిక భారం మోపడమేనన్నారు.ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా అందాల్సిన ఆర్థిక సహాయాన్ని సకాలంలో అందించాలని కోరారు. పథకాల అమలుపై ఎలాంటి అనుమానాలకు తావులేకుండా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, లబ్ధిదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.పేద కుటుంబాల సంక్షేమం, ఆడబిడ్డల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ పథకాలను మరింత పకడ్బందీగా అమలు చేయాలని బీఆర్ఎస్వీ పక్షాన ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు గొట్టే అజయ్ తెలిపారు.

# ఐటిఐ, పాలిటెక్నిక్ కాలేజీల విలీన జీవోను రద్దు చేయాలి

**● జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత**





**హనుమకొండ, ఆగస్టు 17(పిసిడబ్ల్యూ న్యూస్):** ఐటిఐ, పాలిటెక్నిక్ మరియు వొకేషనల్ కాలేజీలను 'యాంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' పరిధిలోకి విలీనం చేస్తూ ప్రభుత్వం చేసిన G.O. Ms No.97 (శక్తి) ని వెంటనే రద్దు చేయాలని ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హన్మకొండ కలెక్టర్‌కు ఎఐడిఎస్ఓ తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రతినిధులు మెమోరాండం సమర్పించారు.ఈ సందర్భంగా ఎఐడిఎస్ఓ నాయకులు మాట్లాడుతూ... వేర్వేరు సిలబస్, కోర్సు వ్యవధి కలిగిన విద్యాసంస్థలను యాంత్రికంగా విలీనం చేయడం వల్ల విద్యా నాణ్యత తీవ్రంగా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల సర్టిఫికెట్ల విలువ, ప్రవేశాలు ఉద్యోగ అవకాశాలపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయ సంఘాలతో ఎలాంటి చర్చలు జరపకుండా ఈ నిర్ణయం తీసుకోవడం అప్రజాస్వామికమన్నారు.ప్రభుత్వం వెంటనే ఈ విలీన ప్రక్రియను నిలిపివేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.

# ఎంజీఎం నర్సింగ్ ఆఫీసర్ల రెగ్యులరైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలి: టియుఎంహెచ్ఇయు



**వరంగల్ ఆగస్టు 17(పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో పనిచేస్తున్న 125 మంది నర్సింగ్ ఆఫీసర్ల సర్వీస్ రెగ్యులరైజేషన్, ప్రొబేషన్ డిక్లరేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. యాద నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం యూనియన్ ప్రతినిధులతో కలిసి ఆయన ఎంజీఎం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా యాద నాయక్ మాట్లాడుతూ... 2024 ఫిబ్రవరిలో విధుల్లో చేరిన నర్సింగ్ ఆఫీసర్లకు 2026 ఫిబ్రవరి నాటికే రెండేళ్ల ప్రొబేషన్ కాలం పూర్తయిందని తెలిపారు. గడువు ముగిసి ఆరు నెలలవుతున్నా రెగ్యులరైజేషన్ కాకపోవడంతో రెండో ఏడాది ఇంక్రిమెంట్లు, సరెండర్ లీవులు, ఇతర చట్టబద్ధమైన ప్రయోజనాలు అందక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.స్పందించిన ఎంజీఎం సూపరింటెండెంట్... ఈ సమస్యను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే. సుధాకర్, నర్సింగ్ ఆఫీసర్ల ప్రతినిధులు సిహెచ్. వెన్నెల, ఎం. అనిల్ కుమార్, డి. రాజేందర్, పవన్, శ్రీహరి, సనా నౌషిన్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# నూతన డీపీఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన బండి పల్లవి



**హనుమకొండ, ఆగస్టు 17(పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారిణి (DPRO)గా బండి పల్లవి సోమవారం రోజున బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆమె జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సమాచార శాఖ ద్వారా ప్రజలకు వేగంగా, సమర్థవంతంగా చేరవేసేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా నూతన డీపీఆర్వో పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన బండి పల్లవికి జిల్లా స్థాయి అధికారులు, సమాచార, పౌర సంబంధాల కార్యాలయ సిబ్బంది, పలువురు విలేకరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# శివాలయం పునఃప్రతిష్ఠాపనకు ముఖ్యఅతిథిగా వచ్చిన ఎమ్మెల్యే





**తొర్రూరు ప్రతినిధి, ఆగస్టు 17(పీసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు మండలంలోని కుందూరుసోమారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి ఆహ్వానం మేరకు నిర్వహించిన శివాలయం పునఃప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకల్లో పాలకుర్తి శాసన సభ్యురాలు  యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామ ప్రజలతో ప్రసంగిస్తూ, శివాలయం పునఃప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా వచ్చిన వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. శివాలయం ఉండటం వల్ల ఎంతో మంది భక్తులు ప్రశాంతతను కోరుకుంటూ ఆలయానికి వెళ్తూ ఉంటారు. ప్రత్యేకంగా శివరాత్రి రోజు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా మన గ్రామంలోని శివాలయం ఉండటంతో అనుకున్న కోరికలు తీర్చే మహిమగల దేవుడు మన గ్రామంలో ఉండటం మన అదృష్టంగా భావించవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు: సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్




**కల్లూరు, ఆగస్టు 17 (పిసిడబ్ల్యూ న్యూస్)** :ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటున్నామని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ అన్నారు. సోమవారం కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఐఏఎస్ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, వారి సమస్యలను సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులకు తగిన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు మరియు ఇతర పరిపాలనా సేవలు సమర్థవంతంగా అందేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి ముఖ్య కార్యకర్తలతో సమావేశం: మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య



**సత్తుపల్లి, ఆగస్టు 17 (పిసిడబ్ల్యూ న్యూస్)** :సత్తుపల్లి మండల, పట్టణానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సమావేశం ఏర్పాటు చేసి పార్టీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ పార్టీ బలోపేతం, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయడం తదితర అంశాలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని సండ్ర వెంకట వీరయ్య  సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 18, 19న జరిగే నిరసన దీక్షలను జయప్రదం చేయండి

**సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు**

**మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి**

**జీవో నెంబర్ 51 ను సవరణ చేయాలి**



**పెనుబల్లి, ఆగస్టు 17 (పిసిడబ్ల్యూ న్యూస్)** :నేడు రేపు జరిగే గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నిరసన దీక్షలను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్రావు పిలుపునిచ్చారు. సోమవారం పెనుబల్లిలో మండల ముఖ్య సమావేశం జి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్రావు పాల్గొని మాట్లాడుతూ ఈనెల  18,19 తారీకుల్లో ఎంపీడీవో కార్యాలయాల ముందు జరిగే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గత 40 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులకు ఇస్తున్న చాలీచాలని వేతనాలతో దుర్భరమైన జీవితాలు అనుభవిస్తున్నారని అన్నారు. నూతనంగా తీసుకొచ్చిన మల్టీపర్పస్ విధానం వలన కార్మికులు అన్ని పనులు ఒక్కరే చేయవలసి వస్తుందని దీనివల్ల గ్రామపంచాయతీ కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మల్టీపర్పస్ విధానాన్ని రద్దు పరచాలని జీవో నెంబర్ 51 ను సవరణ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి నెల ఐదో తారీకు లోపు వేతనాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 18, 19 తేదీల్లో జరుగుతున్న ఎంపీడీవో కార్యాలయాల నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిపి వర్కర్స్ యూనియన్ బాధ్యులు వెంకటేశ్వరరావు, రామారావు, కిషోర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణ లక్ష్మిషాదీ, ముబారక్ పథకాలను నిర్వీర్యం చేసే కుట్రలు ఆపాలి

**హైకోర్టు స్టే పేరుతో పేదింటి ఆడబిడ్డలకు అన్యాయం చేయొద్దు**

**నల్ల బ్యాడ్జీలతో బీఆర్ఎస్ నిరసన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డ బీఆర్ఎస్ నాయకులు**




**మల్లంపల్లి మండల ప్రతినిధి ఆగస్టు 17 (పీసిడబ్ల్యూ న్యూస్):** పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిర్వీర్యం చేసే కుట్రలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆపాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. పేద ప్రజల సంక్షేమం కోసం రూపొందించిన పథకాలను రాజకీయ కక్షతో అడ్డుకోవడం సరికాదని వారు తీవ్రంగా విమర్శించారు. బీఆర్ఎస్ మల్లంపల్లి మండల యూత్ అధ్యక్షుడు మొర్రి రాజు యాదవ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకులు మాచర్ల ప్రభాకర్, హరినాథ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. పేదింటి ఆడబిడ్డలకు కేసీఆర్ అందించిన భరోసాపేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహం తల్లిదండ్రులకు ఆర్థికంగా పెద్ద భారంగా మారుతున్న పరిస్థితిని గమనించిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణ లక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ పథకం ద్వారా ఎంతోమంది పేద కుటుంబాలకు అండగా నిలిచారని పేర్కొన్నారు. అదేవిధంగా మైనారిటీ పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు షాదీ ముబారక్ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ గత ప్రభుత్వం భరోసా కల్పించిందని అన్నారు. ఇలాంటి సంక్షేమ పథకాలు పేద ప్రజల జీవితాల్లో ఎంతో ప్రాధాన్యత కలిగినవని తెలిపారు. హైకోర్టు స్టేపై ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు?కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల విషయంలో హైకోర్టు స్టే విధించినప్పటికీ, ఆ స్టేపై కాంగ్రెస్ ప్రభుత్వం తగిన విధంగా స్పందించకుండా, కౌంటర్ దాఖలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. హైకోర్టు ఇప్పటికే పలుమార్లు గడువు ఇచ్చినా కౌంటర్ దాఖలు చేయకపోవడం వెనుక ప్రభుత్వ ఉద్దేశం ఏమిటో ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. స్టే అంశాన్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాల్సిన సమయంలో మౌనం పాటించడం వల్ల పేదింటి ఆడబిడ్డలకు నష్టం జరుగుతోందని అన్నారు. ఎన్నికల హామీ ఏమైంది?కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో పేద ఆడబిడ్డల వివాహాలకు రూ.లక్షతో పాటు తులం బంగారం అందిస్తామని హామీ ఇచ్చిందని బీఆర్ఎస్ నాయకులు గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయకుండా, ఇప్పటికే అమలులో ఉన్న కల్యాణ లక్ష్మి పథకాన్ని కూడా నిర్వీర్యం చేసే ప్రయత్నం చేయడం దుర్మార్గమని విమర్శించారు. ప్రజల్లో తమపై వ్యతిరేకత పెరుగుతుండటంతోనే పేదల కోసం అమలులో ఉన్న పథకాలను కూడా నీరుగార్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కేసీఆర్‌పై కక్ష ఉంటే పేదలపై ఎందుకు?"కేసీఆర్‌పై రాజకీయ అక్కసు ఉంటే ఉండవచ్చు.. కానీ ఆ అక్కసును పేద ప్రజలపై చూపించవద్దు" అని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను కొనసాగిస్తే ప్రజల్లో కేసీఆర్ పేరు మళ్లీ వినిపిస్తుందనే రాజకీయ ఆలోచనతో పథకాలను నిలిపివేయడం లేదా నిర్వీర్యం చేయడం సరికాదని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే పథకాలను రాజకీయాలకు అతీతంగా కొనసాగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. పేదల సంక్షేమంపై రాజకీయాలు వద్దుకల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు కేవలం ప్రభుత్వ పథకాలు మాత్రమే కాదని, పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే సంక్షేమ కార్యక్రమాలని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ పథకాలపై ఆధారపడుతున్న వేలాది కుటుంబాల పరిస్థితిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. పథకాల అమలులో జాప్యం జరిగితే పేద కుటుంబాలు అప్పులు చేసి తమ పిల్లల పెళ్లిళ్లు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందిఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం హైకోర్టు స్టే అంశంపై వెంటనే స్పందించి, అవసరమైన న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగిస్తూ పేదింటి ఆడబిడ్డలకు భరోసా కల్పించాలని కోరారు. పేదల సంక్షేమానికి ఉద్దేశించిన పథకాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరిగితే బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని వారు హెచ్చరించారు. "పేదల పథకాలను కాపాడే వరకు పోరాటం ఆపేది లేదు" అని స్పష్టం చేశారు. నాయకులు, కార్యకర్తల పాల్గొనడం ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఎండి జానీ, ఎండిచోటు మమ్మద్, వార్డు మెంబర్ ఎండి పాషా, మాజీ సర్పంచ్ గుగులోత్ తిరుపతి, గ్రామ పార్టీ అధ్యక్షుడు అనిల్, ఏనుగందుల రాజయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పేదల సంక్షేమ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

# బర్త్ సర్టిఫికెట్ కోసం ఎవరూ డబ్బులు అడగలేదు

**తహసీల్దార్ కార్యాలయ అధికారులపై తాను ఎలాంటి ఆరోపణలు చేయలేదని మల్లంపల్లి వాసి ఓర్సు లలిత స్పష్టీకరణ**

**తన మాటలను వక్రీకరించి ప్రచారం చేయడం సరికాదు.. వాస్తవాలు తెలుసుకున్న తర్వాతే వార్తలు ప్రచారం చేయాలని విజ్ఞప్తి**

**మల్లంపల్లి మండల ప్రతినిధి ఆగస్టు 17(పిసిడబ్ల్యూ న్యూస్):** బర్త్ సర్టిఫికెట్ కోసం తహసీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది తనను ఎలాంటి డబ్బులు అడగలేదని మల్లంపల్లి గ్రామానికి చెందిన ఓర్సు లలిత స్పష్టం చేశారు. గత కొన్ని నెలలుగా బర్త్ సర్టిఫికెట్ కోసం కార్యాలయానికి పలుమార్లు వెళ్లినట్లు తెలిపిన ఆమె.. దరఖాస్తు ప్రక్రియలో తలెత్తిన పత్రాల వ్యత్యాసాల కారణంగానే కొంత ఆలస్యం జరిగిందని వివరించారు. బర్త్ సర్టిఫికెట్ కోసం తాను గత నాలుగు నెలలుగా కార్యాలయానికి పలుమార్లు వెళ్లినట్లు లలిత తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సమయంలో సమర్పించిన పత్రాల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు సిబ్బంది గుర్తించారని, అందువల్ల పాఠశాల నుంచి అవసరమైన సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించినట్లు ఆమె వివరించారు. **"నన్ను ఎవరూ డబ్బులు అడగలేదు"** బర్త్ సర్టిఫికెట్ ప్రక్రియ ఆలస్యం కావడంతో తాను ఆందోళనకు గురయ్యానని లలిత తెలిపారు. ఈ నేపథ్యంలో "డబ్బులు ఇస్తే పని త్వరగా చేస్తారా?" అనే ఉద్దేశంతో తానే డబ్బుల విషయాన్ని ప్రస్తావించానని చెప్పారు. అయితే తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు గానీ, సిబ్బంది గానీ తనను డబ్బులు ఇవ్వాలని అడగలేదని ఆమె స్పష్టంగా వెల్లడించారు. తాను స్వయంగా చెప్పిన విషయాలను వేరే అర్థంలో ప్రచారం చేయడం వల్ల అధికారులపై అనవసరమైన అపోహలు ఏర్పడుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన మాటలను వక్రీకరించి ప్రచారం చేయడం సరికాదని, పూర్తి వాస్తవాలు తెలుసుకున్న తర్వాతే ఏదైనా విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. **పత్రాల వ్యత్యాసాల కారణంగానే ఆలస్యం** బర్త్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు ప్రక్రియలో అవసరమైన పత్రాలను సమర్పించిన సమయంలో కొన్ని వివరాల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు సిబ్బంది తనకు తెలియజేశారని లలిత తెలిపారు. ఆ వ్యత్యాసాలను సరిచేసేందుకు పాఠశాల నుంచి అవసరమైన ధ్రువపత్రం తీసుకురావాలని సూచించారని చెప్పారు. దీంతో సంబంధిత పత్రాలు సమకూర్చుకునే ప్రక్రియలో ఆలస్యం జరిగినట్లు వివరించారు. అధికారులు తన పని కావాలని ఆలస్యం చేశారని లేదా తనను డబ్బులు అడిగారని తాను చెప్పలేదని ఆమె మరోసారి స్పష్టం చేశారు. **రుణ వ్యవహారంపైనా చర్చ** ఇదిలా ఉండగా, ఓర్సు లలితకు సంబంధించిన భారతి వీఓ పరిధిలోని సిరివెన్నెల సంఘం రుణ వ్యవహారం కూడా చర్చకు వచ్చింది. అందుబాటులో ఉన్న సమాచార ప్రకారం, 04-08-2018న రూ.83,000 రుణం తీసుకున్నట్లు, అనంతరం 16 నెలల పాటు నెలకు రూ.3,000 చొప్పున చెల్లించినట్లు పేర్కొంటున్నారు. మిగిలిన అసలు, వడ్డీ బకాయిలు ఉన్న సమయంలో సంఘం డిఫాల్ట్‌లోకి వెళ్లినట్లు సమాచారం. అయితే ఈ అంశానికి సంబంధించి రుణ ఖాతా, చెల్లింపులు, సంఘం రికార్డులు, సంబంధిత అధికారిక పత్రాలను పరిశీలించిన తర్వాతే పూర్తి వాస్తవాలు నిర్ధారణ కావాల్సి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో వడ్డీ లేని రుణం మంజూరుకు సంబంధించిన అంశంపై కూడా సంబంధిత అధికారులు పూర్తి వివరాలను వెల్లడించాల్సిన అవసరం ఉందని స్థానికంగా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. **"ప్రభుత్వ సంక్షేమ పథకాలు నాకు అందుతున్నాయి"** తనకు అర్హత ఉన్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని లలిత స్వయంగా వెల్లడించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ కార్యక్రమాల విషయంలో తనకు సహాయం అందుతోందని



ఆమె తెలిపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆమె పేరుతో సోషల్ మీడియాలో, ఇతర వేదికల్లో వచ్చిన ఆరోపణలు ఎంతవరకు వాస్తవమో పరిశీలించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు. **రాజకీయ ప్రయోజనాల కోసం వీడియోలు చేశారనే ఆరోపణలు** ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో రాజకీయ ప్రయోజనాల కోసం మహిళతో తప్పుడు ఆరోపణలు చేయించి, వాటిని వీడియోల రూపంలో రికార్డు చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేశారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తులు లేదా అధికారులు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. ఆరోపణలు వాస్తవమా కాదా అన్నది నిర్ధారించకుండా వ్యక్తులపై లేదా ప్రభుత్వ సిబ్బందిపై నిందలు వేయడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. **అధికారులపై నిరాధార ఆరోపణలు వద్దు** ప్రభుత్వ కార్యాలయాల్లో ఏదైనా సమస్య ఎదురైతే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అధికారికంగా ఫిర్యాదు చేయాలని స్థానికులు సూచిస్తున్నారు. వాస్తవాలను నిర్ధారించకుండా సోషల్ మీడియాలో వీడియోలు, ఆరోపణలు ప్రచారం చేయడం వల్ల ప్రజల్లో అపోహలు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రత్యేకంగా ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, సిబ్బందిపై అవినీతి ఆరోపణలు వచ్చినప్పుడు సంబంధిత రికార్డులు, ఆధారాలు, ఫిర్యాదుదారుడి పూర్తి వివరణ, అధికారుల స్పందన తీసుకున్న తర్వాతే వార్తలను ప్రచురించడం బాధ్యతాయుతమైన జర్నలిజానికి అవసరమని తెలిపారు. **లలిత వివరణతో వెలుగులోకి వచ్చిన వాస్తవం** బర్త్ సర్టిఫికెట్ వ్యవహారంలో "తనను ఎవరూ డబ్బులు అడగలేదు.. డబ్బుల విషయాన్ని తానే ప్రస్తావించాను" అంటూ ఓర్సు లలిత ఇచ్చిన వివరణ ఇప్పుడు కీలకంగా మారింది. దీంతో ఈ వ్యవహారంపై గతంలో జరిగిన ప్రచారానికి, ప్రస్తుతం ఆమె ఇస్తున్న వివరణకు మధ్య ఉన్న వ్యత్యాసాలను పరిశీలించాల్సిన అవసరం ఏర్పడింది. ఏదైనా ఆరోపణ వచ్చినప్పుడు ఒకవైపు కథనాన్ని మాత్రమే ఆధారంగా చేసుకోకుండా, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల వివరణను కూడా తీసుకుని, సంబంధిత పత్రాలు మరియు వాస్తవాలను పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయానికి రావాలని స్థానికులు కోరుతున్నారు. బర్త్ సర్టిఫికెట్ కోసం అధికారులు డబ్బులు అడగలేదని లలిత స్వయంగా స్పష్టం చేసిన నేపథ్యంలో, ఈ అంశంపై మరింత అపోహలు లేకుండా వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొన్నారు.

# చెత్త డంపింగ్‌తో నరకం.. నాచారం ప్రజల గగ్గోలు!

**కాలనీ పరిసరాల్లో విచ్చలవిడిగా వ్యర్థాల డంపింగ్**

**దుమ్ము, దుర్వాసనతో ప్రజల అవస్థలు..**

**అధికారుల తీరుపై ఆగ్రహం**

**సమస్యను పట్టించుకోని ప్రభుత్వంపై స్థానికుల మండిపాటు**

**ఉప్పల్, ఆగస్టు 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** నాచారం డివిజన్ పరిధిలోని నాచారం, ఎర్రగుంట, బాబానగర్, దుర్గా నగర్, హనుమాన్ నగర్, సెవెన్ హిల్స్ కాలనీ పరిసరాల్లో చెత్త, వ్యర్థాలను డంపింగ్ చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యర్థాల నుంచి వస్తున్న దుమ్ము, దుర్వాసనతో కాలనీవాసులు నరకయాతన అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం..** చెత్త డంపింగ్‌పై పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు




చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యం, కాలనీ పరిసరాల పరిశుభ్రతపై ప్రభుత్వానికి, అధికారులకు కనీస శ్రద్ధ లేదని మండిపడుతున్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. **ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనకు సిద్ధం** కాలనీ పరిసరాలను చెత్త డంపింగ్ ప్రాంతాలుగా మార్చడం వెంటనే నిలిపివేయాలని, ఇప్పటికే పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని స్థానికులు డిమాండ్ చేశారు. సమస్యపై అధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ మేరకు పొన్నాల రాజ్, సోఫీ, లింబజ్జి, శ్రీను తదితరులు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, అలాగే జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ప్రజల సమస్యను అత్యవసరంగా పరిగణించి చర్యలు తీసుకోవాలని కోరారు.

# జేడి మల్లంపల్లిలో ఘనంగా నాగుల పంచమి వేడుకలు



**జేడి మల్లంపల్లి, ఆగస్టు 17 (పి.సి.డబ్ల్యూ. న్యూస్):** మండల కేంద్రమైన జేడి మల్లంపల్లిలో నాగుల పంచమి వేడుకలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. శ్రావణ మాసం సందర్భంగా ఉదయం నుంచే స్థానిక నాగపుట్టల వద్దకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, పాలు సమర్పించి తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని శివాలయంలో నాగదేవతతో పాటు శివయ్యకు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంత ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రతి కుటుంబానికి ఆయురారోగ్యాలు కలగాలని భక్తులు ప్రార్థనలు చేశారు. వేడుకల్లో స్థానిక మహిళలు, చిన్నారులు, యువత, పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తుల రాకతో జేడి మల్లంపల్లి మండల కేంద్రం ఆధ్యాత్మిక వాతావరణంతో పులకించిపోయింది.

# ప్రజావాణి దరఖాస్తులపై తక్షణ స్పందన

**ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యం: ఎంపీడీవో చంద్రశేఖర్**

**ప్రజలకు అధికార యంత్రాంగాన్ని చేరువ చేస్తున్న ప్రజావాణి**

**కల్లూరులో 26 దరఖాస్తులు**





**కల్లూరు, ఆగస్టు 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు అధికార యంత్రాంగాన్ని మరింత చేరువ చేస్తోందని కల్లూరు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం కల్లూరు రైతు వేదికలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలతో పాటు కల్లూరు మున్సిపాలిటీ పరిధి నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై అధికారులకు దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, మున్సిపల్, వ్యవసాయ, విద్యుత్ తదితర పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 26 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. భూములు, మున్సిపల్ సమస్యలు, వ్యవసాయం, విద్యుత్, పలు శాఖలకు సంబంధించిన అంశాలకు సంబంధించిన సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత శాఖ అధికారులకు వెంటనే బదిలీ చేసి, సమస్య పరిష్కార ప్రక్రియను పర్యవేక్షిస్తామని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. దరఖాస్తు స్వీకరించిన వెంటనే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని, దరఖాస్తుదారుడికి కూడా మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని చెప్పారు. తమ దరఖాస్తు ఏ అధికారికి బదిలీ అయింది, ప్రస్తుతం ఏ స్థాయిలో ఉంది, పరిష్కారం కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు అనే విషయాలను తెలుసుకునే అవకాశం ప్రజలకు ఉండటం ప్రజావాణి ప్రత్యేకతగా ఆయన పేర్కొన్నారు. సమస్య పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుపై అధికారులు బాధ్యతతో స్పందించాలని, సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. ప్రజలు ఎలాంటి అపోహలకు తావులేకుండా తమ సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం కల్పించిన ఈ వేదికను మండలంలోని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ బ్రహ్మేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ సాయి కృష్ణారెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఎం రూప, విద్యుత్ శాఖ అధికారి మహేంద్ర బాబు, ఉద్యాన శాఖ అధికారి నగేష్ తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సంగీత, నృత్య నిలయానికి మహోన్నత గౌరవం

- 'సేవారత్న'గా భాసించిన వసంతలక్ష్మి
- కళామతల్లికి నీరాజనం...
- సాంస్కృతిక వేదికపై చిన్నారుల నృత్య విన్యాసాలు ప్రశంసనీయం!









**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** అక్షరం, స్వరం, అభినయం కలగలసిన చోట ఆత్మీయత విరబూసింది. కళను శ్వాసగా, సేవను మార్గంగా మలచుకున్న సద్గుణ దీప్తికి సముచిత గౌరవం దక్కింది. స్వర మాధురి సాహితీ సాంస్కృతిక సంస్థ 10వ వార్షికోత్సవం, 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభ సమయాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభలో నిర్వహించిన 'స్వర నృత్య వేడుక' అత్యంత వైభవంగా, హృదయాలను హత్తుకునేలా సాగింది. సంగీత కళారత్నం, గాన ముగ్ధిక సాయి పావని సంకల్పంతో చోటుచేసుకున్న ఈ వేడుకలో, తెలంగాణ తొలి శాసనసభాపతి సిరికొండ మధుసూదనాచారి చేతుల మీదుగా 'శ్రీసాయి కృప మ్యూజిక్, డాన్స్ అండ్ హాబీ స్కూల్' డైరెక్టర్, ప్రముఖ వోకల్ ఆర్టిస్ట్ వసంత లక్ష్మికి 'సేవారత్న పురస్కారం' అందజేసి ఘనంగా సత్కరించారు. కళారంగానికి ఆమె అందిస్తున్న నిరంతర సేవలను, నిశ్శబ్ద సాధనను నిర్వాహకులు ఎంతో ఆత్మీయంగా కొనియాడారు. పురస్కార ప్రధానం అనంతరం శ్రీసాయి కృప పాఠశాల విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు వేదికకు ప్రత్యేక కాంతులు తెచ్చిపెట్టాయి. ఆ చిన్నారులు అడుగులు వేస్తుంటే... స్వరం నృత్యంగా మారింది, భావం జీవన కళగా రూపుదిద్దుకుంది. వారి లేత అడుగుల సవ్వడి, ముఖంలో తొణికిసలాడిన అభినయ ముద్రలు చూసే ప్రతి ఒక్కరి హృదయాన్ని పరవశింపజేశాయి. చిన్నారి కళాకారుల ప్రతిభను గుర్తించి, వారిని వేదికపై పురస్కారాలతో అభినందించిన తీరు వారిలో కొండంత ఉత్సాహాన్ని నింపింది. కళాకారులు, సాహితీవేత్తలు, సాంస్కృతిక ప్రియుల కలయికతో శ్రీత్యాగరాయ గాన సభ ఒక మానవీయ అనుబంధాల నిలయంగా మారిపోయింది. గురువుకి దక్కిన సత్కారం, శిష్యుల అద్భుత ప్రదర్శనలు ఈ వేడుకను అందరి మదిలో చిరస్థాయిగా నిలిచిపోయేలా చేశాయి.

# ప్రత్యేక సమగ్ర సవరణ2026లో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ

**109-ములుగు నియోజకవర్గంలో 2,09,128 మంది ఓటర్లు**

**సెప్టెంబర్ 16 వరకు దావాలు, అభ్యంతరాల స్వీకరణకు అవకాశం**

**ఫారం-6, 7, 8 ద్వారా దరఖాస్తులకు అవకాశం**

**బీఎల్‌ఓలతో పాటు ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తులు సమర్పించవచ్చు**

**ప్రతి ఓటరూ జాబితాలో తమ వివరాలను పరిశీలించుకోవాలి**

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు**



**ములుగు జిల్లా ఆగస్టు17(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం2026లో భాగంగా 109-ములుగు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను సోమవారం ప్రచురించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. 109-ములుగు నియోజకవర్గ పరిధిలోని 308 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో మొత్తం 2,09,128 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. వీరిలో 1,01,964 మంది పురుష ఓటర్లు, 1,07,143 మంది మహిళా ఓటర్లు, 21 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో ప్రతి ఓటరూ తమ పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు. అర్హత కలిగిన పౌరుల పేరు ముసాయిదా జాబితాలో లేకపోయినా, ఇప్పటికే నమోదైన ఓటర్ల వివరాల్లో ఏవైనా తప్పులు, మార్పులు ఉన్నా నిర్ణీత గడువులోగా సంబంధిత దావాలు, అభ్యంతరాలు సమర్పించవచ్చని తెలిపారు. ఓటర్ల జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునేందుకు ఫారం-6, నమోదుపై అభ్యంతరం లేదా పేరు తొలగింపునకు ఫారం-7, ఓటరు వివరాల్లో సవరణలు చేసుకోవడానికి లేదా నివాసం మారిన సందర్భంలో నమోదు మార్పు కోసం ఫారం-8ను ఉపయోగించుకోవచ్చని పేర్కొన్నారు. ఓటర్లు తమ దావాలు, అభ్యంతరాలను నేరుగా తమ పరిధిలోని బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ)కు సమర్పించవచ్చని తెలిపారు. అదేవిధంగా ఈసీఐనెట్ యాప్ లేదా ఓటర్ సర్వీస్ పోర్టల్ ద్వారా కూడా సంబంధిత దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించుకోవచ్చని పేర్కొన్నారు. ఆఫ్‌లైన్‌లో దావాలు, అభ్యంతరాలను ములుగు రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం, 109-ములుగు నియోజకవర్గ పరిధిలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాలు, అన్ని పోలింగ్ కేంద్రాలలో సమర్పించవచ్చని తెలిపారు. దావాలు, అభ్యంతరాల సమర్పణకు సెప్టెంబర్ 16వ తేదీ వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, ఓటర్ల వివరాలు ఖచ్చితంగా, పారదర్శకంగా ఉండేలా ప్రత్యేక సమగ్ర సవరణ2026 ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. 109-ములుగు నియోజకవర్గ ప్రజలందరూ ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించి తమ పేరు, ఇతర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని, అవసరమైన సందర్భంలో సెప్టెంబర్ 16వ తేదీలోగా ఫారం-6, ఫారం-7 లేదా ఫారం-8 ద్వారా దావాలు, అభ్యంతరాలు సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు కోరారు.

# కొత్తపల్లి ZPHS పాఠశాల ఆవరణలో ఘనంగా వనమహోత్సవం

**కరీంనగర్,ఆగస్టు17(పీసీడబ్ల్యూ న్యూస్):** కొత్తపల్లి ZPHS పాఠశాల ఆవరణలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాల్లో 300 మొక్కలను నాటారు. పాఠశాల ప్రాంగణాన్ని పచ్చదనంతో నింపడంతో పాటు విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కన్నం రమేష్, 17వ డివిజన్ కార్పొరేటర్ వేముల కవిత-చంద్రశేఖర్, 18వ డివిజన్ కార్పొరేటర్ వాసాల రమేష్, స్వర్గం నర్సయ్యతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసాల రమేష్ మాట్లాడుతూ.. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలను పెంచి, సంరక్షించాలని సూచించారు. పచ్చదనం పెంపొందించేందుకు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాఠశాల ఆవరణలో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



# హుజురాబాద్ నియోజకవర్గంలో బీజేపీ బీఎల్ఏ-2ల సమావేశం..

**- ఎస్ఐఆర్ ఫేజ్-2పై దిశా నిర్దేశం చేసిన జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం....**



**హుజురాబాద్ ఆగస్టు 17(పిసిడబ్ల్యూ న్యూస్):** హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలో ఎస్ఐఆర్ (ఎస్ఐఆర్ ) ఫేజ్-2కి సంబంధించి బీఎల్ఏ-2ల తో సోమవారం రోజున బిజెపి ముఖ్య సమావేశం నిర్వహించింది.. ఈ సమావేశానికి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం ముఖ్య అతిథిగా విచ్చేసి ఓటర్ల జాబితా పునర్వ్యవస్థీకరణ ప్రక్రియపై, ఫేజ్ 2 పై చేపట్టాల్సిన పనులపై దిశానిర్దేశం చేశారు.. అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటర్ల జాబితాలో చేర్చడం ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయడంపై రాష్ట్ర నాయకులు ఆంటోనీ రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి కీలక సూచనలు చేశారు. ఈ సమావేశంలోజిల్లా ఇన్‌చార్జ్ హరి బాబుఎస్ఐఆర్ నియోజకవర్గ బీఎల్ఏ-1 పుప్పాల రఘుఎస్ఐఆర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సీహెచ్. నరసింహరాజు,మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు నిర్మలా దేవి, నాయకులు ఎర్రవెల్లి సంపత్ రావు, ఎస్ఐఆర్ నియోజకవర్గ టోలీ మెంబర్ వోడ్నాల వేణు,మండల అధ్యక్షులు కొలకని రాజు, దొంతరవేని రమేష్, తూర్పటి రాజు, పారుపెల్లి కొండాల్ రెడ్డి, ర్యాకం శ్రీనివాస్, బత్తిని నరేష్, బైరెడ్డి వెంకటరమణారెడ్డివీరితో పాటు పలువురు మండల పదాధికారులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# రామడుగు జామా మసీదులో సీరతున్న బీనీ కార్యక్రమంపై మష్వరా.



**రామడుగు,ఆగస్టు17 (పీసీడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండల కేంద్రంలోని జామా మసీదులో జమీయతుల్ హుఫ్ఫాజ్ కరీంనగర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జమీయతుల్ హుఫ్ఫాజ్ ప్రతినిధులు, సభ్యులతో పాటు ముఖ్య అతిథిగా ఎం.డి. మొయిజ్, సర్పంచ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులను శాలువాలతో సత్కరించారు. అనంతరం నిర్వహించిన మష్వరాలో ఆగస్టు 23, 2026 ఆదివారం రోజున రామడుగు జామా మసీదులో సీరతున్నబీ నీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జమీయతుల్ హుఫ్ఫాజ్ నాయబ్ సదర్ హాఫిజ్ జియాఉల్లా ఖాన్, హాఫిజ్ మొహజ్జమ్ హుస్సేన్, హాఫిజ్ సయ్యద్ రిజ్వాన్, హాఫిజ్ వసీముద్దీన్, రామడుగు జామా మసీదు ఇమామ్ హాఫిజ్ అబ్దుల్ మజీద్ తదితరులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా రాబోయే సీరతున్నబీ నీ జల్సాను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమం విజయవంతంగా జరగాలని ప్రత్యేకంగా దువా చేశారు. సమావేశానికి హాజరైన అతిథులు, సభ్యులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు ఘన సన్మానం



**హైదరాబాద్, ఆగస్టు 17(పి సి డబ్ల్యూ న్యూస్):** ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు డాక్టరేట్ లభించిన సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. పూస గోరఖ్‌నాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొని ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముఠా గోపాల్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. డాక్టరేట్ సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు మరిన్ని విజయాలు చేకూరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ముచ్చకుర్తి ప్రభాకర్, నాని, కిషోర్, రాము తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముషీరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని వారు పేర్కొన్నారు.

# ప్రజావాణిలో ప్రజా సమస్యలపై చర్చ

**- పాల్గొన్న మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు**

**మల్లంపల్లి, ఆగస్టు 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న మండల ప్రజావాణి కార్యక్రమం మల్లంపల్లి మండల కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు పాల్గొన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందేందుకు ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. మండల పరిధిలోని ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారులకు తెలియజేసి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను అధికారులు పరిశీలించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కొండం రవీందర్‌రెడ్డి, శివతండా సర్పంచ్ భాస్కర్, మల్లంపల్లి మండల స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో రహీ మొద్దీన్, వార్డు సభ్యులు ల్యాద లక్ష్మణ్‌తో పాటు పలువురు ప్రజలు పాల్గొన్నారు.




# ప్రజల సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కారం

**గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రతి దరఖాస్తుపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలి**

**ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలి**

**అత్యవసర సమస్యలపై తక్షణమే స్పందించాలి**

**ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా నిర్ణీత సమయంలో పరిష్కారం చూపాలి**

**ఒంటరి మహిళలు, వితంతువుల పింఛన్ దరఖాస్తులను 31లోగా స్వీకరించాలి**

**మారుమూల గ్రామాలు, గూడేల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలి**

**అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలి: మంత్రి సీతక్క**



**ములుగు జిల్లా ఆగష్టు17( పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజల సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కారం చూపాలని,మండల ప్రజావాణి కి వచ్చిన ప్రతి దరఖాస్తుపై స్పష్టమైన సమాధానం తెలియజేయాలని,ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని,అత్యవసర సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని,ప్రజలను సమస్యలను పరిష్కరించడంలో అధికారులు కాలయాపన చేయకూడదని,ఒంటరి మహిళలు, వితంతువుల,వికలాంగుల పింఛన్ దరఖాస్తులను 31లోగా స్వీకరించాలని,స్థానిక అధికారులు మారుమూల గ్రామాలు, గూడేల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలని,అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని,ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రాలు, హైదరాబాద్ వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మండల స్థాయిలోనే గ్రీవెన్స్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి సమస్యలకు పరిష్కారం చూపాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. సోమవారం గోవిందరావుపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల ప్రజావాణి కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలాల వారీగా గ్రీవెన్స్ కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించడం ద్వారా జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజల సంఖ్య తగ్గడంతో పాటు స్థానికంగానే సమస్యలకు వేగంగా పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అధికారులు విధులను బాధ్యతగా, చిత్తశుద్ధితో నిర్వహించి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కార దిశగా పరిశీలించాలని సూచించారు. ఒంటరి మహిళలు, వితంతువులకు, సంబంధించిన పింఛన్ దరఖాస్తులను ఈ నెల 31వ తేదీలోగా అన్ని గ్రామాల నుంచి పూర్తిస్థాయిలో స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. వికలాంగులు, గీత కార్మికులు, నేత కార్మికులు, తలసేమియా బాధితులు తదితర అర్హుల పింఛన్లకు ప్రభుత్వం దశలవారీగా చర్యలు చేపడుతోందని తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోలేదనే పరిస్థితి తలెత్తకుండా ఎంపీడీఓలు, తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా మారుమూల గ్రామాలు, అంతర్గత వాడలు, గూడేల్లో పర్యటించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలన్నారు. పస్రా, గోవిందరావుపేట, చల్వాయి తదితర ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చామని, ఎస్టీ తండాలు, గూడేల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి సుమారు రూ.50 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అంతర్గత, సీసీ రహదారుల సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, తహసిల్దార్ సృజన్ కుమార్, ఎంపీడీవో వరుణ్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# ప్రభుత్వ సేవలు మరింత చేరువ..

**ప్రజావాణిలో వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి**



**కరీంనగర్ ఆగస్టు 17(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో చేపట్టిన ప్రజావాణి కార్యక్రమాన్ని మండల స్థాయికి విస్తరించడం ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువవుతాయని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం తిమ్మాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించిన వినతులను పరిశీలించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడారు. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఇజ్జగిరి లింగవ్వ అనే ఒంటరి మహిళ పెన్షన్ కోసం పెట్టుకున్న అర్జీని పరిశీలించి అక్కడికక్కడే పెన్షన్ మంజూరు పత్రాన్ని ఎమ్మెలే ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మండల స్థాయిలోనే ప్రజావాణి నిర్వహించడం వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు సానుకూల దృక్పథంతో పరిశీలించి, నిబంధనల మేరకు వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉండే పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ప్రవేశపెట్టి మండల వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకు ప్రభుత్వ పాలన వెళ్లగా, ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజావాణి కార్యక్రమాన్ని మండల స్థాయికి విస్తరించడం వల్ల ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువవుతాయని ఆయన పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే ప్రజలకు సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలు వ్యయ ప్రయాసాలకు ఒర్చి ఇక నుంచి జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని మండలస్థాయిలో నిర్వహించడం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. జిల్లా స్థాయిలో ఇచ్చే అర్జీలు సత్వరంగా పరిష్కారమవుతాయనే అపోహ ప్రజల్లో నెలకొని ఉందని, జిల్లాస్థాయిలో ఇచ్చిన విచారణ నిమిత్తం మళ్లీ క్షేత్రస్థాయికి పంపించడం వల్ల సమస్య పరిష్కారంలో ఆలస్యం జరిగే అవకాశం ఉంటుందన్నారు. తమ సమస్యలను మండలస్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో నివేదించుకోవా లని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎన్.రాజీవ్ మల్హోత్ర, తహసీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి సురేందర్,మండల వైద్యాధికారి డాక్టర్ పుల్లారావు, ట్రాన్స్ కో ఏఈ ఖాసీం, సీఐ బొల్లం రమేశ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, స్థానిక సర్పంచ్ గంకిడి లక్ష్మారెడ్డి, నుస్తులాపూర్,పోరండ్ల ప్యాక్స్ చైర్మన్లు మోరపల్లి రమణారెడ్డి, గోపు మల్లారెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ చెన్నబోయిన రవి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దావు సంపత్ రెడ్డి, పార్టీ నాయకులు సుధగోని లక్ష్మీనారాయణ గౌడ్, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, మామిడి అనిల్ కుమార్, చింతల లక్ష్మారెడ్డి, పోలు రాము,రమేశ్, కొత్త తిరుపతిరెడ్డి, పెరుక రవీందర్, పొన్నాల సంపత్,కేతిరెడ్డి ఎల్లారెడ్డి, మాచర్ల అంజయ్య, గుంటి మల్లేశం,మాచర్ల అనిల్, పులి కృష్ణ, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వందేమాతరం పట్ల కాంగ్రెస్ అగ్రనేతల అవమానకర వైఖరిని ఖండిస్తూ కరీంనగర్ బీజేవైఎం నిరసన

**కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ దేశ ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్**



**కరీంనగర్ ఆగస్టు 17(పిసిడబ్ల్యూ న్యూస్):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా దేశ అత్యున్నత జాతీయ గేయమైన 'వందేమాతరం' ఆలాపన వేళ కాంగ్రెస్ అగ్రనేతలు ప్రదర్శించిన నిర్లక్ష్యం, గేయం పట్ల అవలంబించిన అవమానకర వైఖరిపై కరీంనగర్ బిజేవైఎం తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. సోమవారం రోజున కరీంనగర్ కోర్టు చౌరస్తాలో భారతీయ జనతా యువ మోర్చా కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు, ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వందేమాతరం సంపూర్ణ ఆలాపన జరుగుతున్న సమయంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులు అత్యంత బాధ్యతారహితంగా వ్యవహరించారని బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సంగ నరేష్ తీవ్రంగా మండిపడ్డారు. జాతీయ గేయం పట్ల కనీస గౌరవం ప్రదర్శించకపోగా, ఇతరులతో మాట్లాడుతూ ఆలాపనకు ఆటంకం కలిగించేలా ప్రవర్తించడం దేశ ప్రజల మనోభావాలను తీవ్రంగా గాయపరిచిందని ఆయన ధ్వజమెత్తారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేవైఎం కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశభక్తిని చాటాల్సిన పవిత్ర వేదికపైనే జాతీయ గేయానికి అవమానం జరగడం క్షమించరాని నేరమని వారు ఆరోపించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో అగ్రగణ్యమైన స్థానం ఉన్న వందేమాతరం గేయాన్ని అవమానించిన కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ వెంటనే దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిజేవైయం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరెడ్ల ప్రవీణ్ రెడ్డి,బిజెపి జిల్లా నాయకులు గుజ్జ శ్రీనివాస్ రావు,బిజేవైయం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మునిగంటి కుమార్,ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ నాయక్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్, ఎడవెల్లి శశిధర్ రెడ్డి,నక్క ప్రమోద్,గుర్రం వెంకటేశ్ గౌడ్,ఆకుల మనోహర్,సతీష్,తాడూరి కిరణ్,సుదమల్ల నాగరాజు,రమేష్ యాదవ్,రాసబత్తుల వినయ్,గడ్డం సందీప్,జాగిరి రాజేందర్,కార్తిక్,శ్రీకర్,నవీన్,గణేష్ బిజేవైయం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీజేపీకి వ్యతిరేకంగా దళితులు సంఘటితం కావాలి

**- ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపు**

**మాలిన్యం మీ మనసుల్లో ఉంది, వేదికల్లో కాదు - వైద్యుల అంజన్ కుమార్**

**గంగాజలంతో శుద్ధి చేసి అంటరానితనాన్ని బయటపెట్టారు - సత్తు మల్లేశ్**

**రాబోయే ఎన్నికల్లో బీజేపీకి బుద్ధిచెప్పాలి - ఎస్సీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్**

**ఖర్గే గారి అవమానం దళిత ఆత్మాభిమానంపై దాడి - కరీంనగర్‌లో కాంగ్రెస్ ఎస్సీ సెల్ ధర్నా**

**బీజేపీకి వ్యతిరేకంగా దళితులు సంఘటితం కావాలి: ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ**





**కరీంనగర్ టౌన్ ఆగస్ట్ 17(పిసి డబ్ల్యూ న్యూస్):** దళితుల పట్ల బీజేపీ అనుసరిస్తున్న వివక్ష, అణచివేత విధానాలను వ్యతిరేకిస్తూ దళితులంతా సంఘటితం కావాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఖర్గేకు జరిగిన అవమానానికి నిరసనగా కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్‌లో నిర్వహించిన ధర్నాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, పార్లమెంట్‌లో కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున ఖర్గేకు జరిగిన అవమానానికి నిరసగా సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఎస్సీ సెల్ జిల్లాశాఖ అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ మల్లికార్జున ఖర్గే కు జరిగిన అవమానాన్ని తేలికగా తీసుకోవద్దని, దళితుల ఆత్మాభిమానం, అస్థిత్వంపై జరిగిన దాడిగా భావించాలన్నారు. దళితులను అవమానించడం కమలనాధులకు కొత్తేమీ కాదని, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ను మొదలుకొని మల్లికార్జున ఖర్గే వరకూ కొనసాగిందన్నారు. ఇక ముందు ఈ వివక్ష కొనసాగకుండా ఉండేందుకు కేంద్రంలో బీజేపీ మెడలు వంచాల్సిన అవసరం ఉందన్నారు. కపట నాటకాలు ఆడుతున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్,సంఘ్ పరివార్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రాజ్యాంగ విలువలకు బీజేపీ పాతరేస్తూ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాదం కల్పిస్తున్నదని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ విమర్శించారు. దేశంలో మతోన్మాద, విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా దళితులు, బడుగు బలహీన వర్గాలు, మైనారిటీలు, ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల మధ్య మతం, కులం పేరుతో చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందే శక్తులను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశ్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీజేపీకి బుద్ధిచెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అంబేద్కర్ ను అమిత్ షా అవమానించగా, తాజాగా మల్లికార్జున ఖర్గేను కమలనాధులు అవమానించారన్నారు. మహనీయులను సైతం అవమానాలకు గురిచేస్తున్నారని, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న మహనీయుల ఫొటోలను కూడా మాయం చేస్తున్నారని ఆయన విమర్శించారు. మల్లికార్జున ఖర్గే పాల్గొన్న వేదికను గంగాజలాలతో శుద్ధి చేయడం ద్వారా అంటరాని తనాన్ని రుజువు చేశారని ఆయన పేర్కొన్నారు. బీజేపీ అవలంబిస్తున్న విధానాలు, వైఖరికి నిరసనగా దళితులంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ మతోన్మాద బీజేపీ బుద్ధిచెప్పాల్సిన అవసరం ఉందన్నారు. మల్లికార్జున ఖర్గే పాల్గొన్న వేదికను కమలనాథులు శుద్ధి చేయడం సిగ్గుచేటని విమర్శించారు. వేదికలను శుద్ధి చేయడం కాదు మాలిన్యంతో నిండిన మనసులు శుద్ధి చేసుకోవాలని ఆయన కమలనాధులకు సూచించారు. ఈ ధర్నా కార్యక్రమంలో కరీంనగర్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్, మైనార్టీ సెల్ అధ్యక్షులు తాజుద్దీన్, ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రావణ్ నాయక్, మండల అధ్యక్షులు రామ్ రెడ్డి, స్వామి గౌడ్, వెన్న రాజ మల్లయ్య సిరాజ్ హుస్సేన్, అబ్దుల్ రెహమాన్, ముస్తాక్ అహ్మద్, మాతంగి అనిల్, రెడ్డవేని రాజు, బోయిన విద్యాసాగర్, అల్వాల కోటి, జీడి రమేష్, ఆసంపల్లి శ్రీనివాస్, యనమల మంజుల, ములకల కవిత, మమత, తిరుమల, సముద్రాల అజయ్, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు బత్తుల పరుశు రాములు, సముద్రాల లక్ష్మణ్, ఆరేపల్లి రాహుల్, వాసాల శ్రీనివాస్, కీర్తి కుమార్, తిరుపతి, బోయిని కృష్ణ బాబు, ఇతర దళిత నాయకులు పాల్గొన్నారు.

# మండల స్థాయి ప్రజావాణికి విశేష స్పందన

**జిల్లాలోని 10 మండలాల్లో ప్రజావాణి నిర్వహణ**

**ప్రజల నుంచి 180 దరఖాస్తుల స్వీకరణ**

**ప్రజల సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు**

**అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి**



**ములుగు జిల్లా ఆగష్టు17(పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లాలోని అన్ని మండలాల్లో సోమవారం నిర్వహించిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా, మండల స్థాయిలోనే వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలనే ఉద్దేశంతో జిల్లాలోని 10 మండలాల్లో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాల్లో వివిధ శాఖలకు చెందిన 219 మంది అధికారులు పాల్గొనగా, ప్రజల నుంచి మొత్తం 180 దరఖాస్తులు అందినట్లు అదనపు కలెక్టర్ వెల్లడించారు. మండలాల వారీగా ఏటూరునాగారం మండలంలో 24, గోవిందరావుపేటలో 14, కన్నాయిగూడెంలో 3, మల్లంపల్లిలో 32, మంగపేటలో 42, ములుగులో 14, ఎస్.ఎస్. తాడ్వాయిలో 10, వెంకటాపూర్‌లో 25, వెంకటాపురంలో 12, వాజేడులో 4 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఏటూరునాగారం మండలంలో ఎంపీపీ సమావేశ మందిరం, గోవిందరావుపేటలో రైతు వేదిక, కన్నాయిగూడెంలో రైతు వేదిక, మల్లంపల్లిలో ఎంపీపీ కార్యాలయం, మంగపేటలో ఎంపీపీ కార్యాలయం, ములుగులో ఎంపీపీ కార్యాలయం, ఎస్.ఎస్. తాడ్వాయిలో ఎంపీపీ సమావేశ మందిరం, వెంకటాపూర్‌లో ఎంపీడీఓ కార్యాలయం, వెంకటాపురంలో ఎంపీపీ కార్యాలయం, వాజేడులో ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను మండల స్థాయిలోనే త్వరితగతిన పరిష్కరించాలని సూచించినట్లు తెలిపారు. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ప్రజావాణికి వచ్చే అర్జిదారులను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పకుండా, వారి దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను తెలియజేయాలని, అవసరమైన సందర్భాల్లో దరఖాస్తుదారులతో ఫోన్ ద్వారా సంప్రదించి సమస్య పరిష్కార స్థితిని వివరించాలని అధికారులకు సూచించినట్లు అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి తెలిపారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని, నిర్ణీత సమయంలో పరిష్కరించడమే మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం ప్రధాన లక్ష్యమని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# తల్లాడలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి

- **ప్రజావాణిలో వినతిపత్రం అందజేసిన నాయకులు**
- **మండల అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి**




**తల్లాడ, ఆగస్టు 17 (పిసిడబ్ల్యూ న్యూస్)**:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మండల కేంద్రాలలో ఏర్పాటుచేసిన ప్రజావాణిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గొడుగునూరి లక్ష్మారెడ్డి తల్లాడ లో సిటీ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానశీ గా భద్రాచలం, కొత్తగూడెం, సత్తుపల్లి రాజమండ్రి కి ప్రధాన కూడలిగా ఉన్న తల్లాడలో సిటీ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం వలన ఎంతో సుందరవంతంగా ఉంటుందని వారు అన్నారు. వీలైనంత త్వరగా పై అధికారులతో మాట్లాడి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసే విధంగా కృషి చేయాలని వారు కోరారు. అదే విధంగా ఎన్టీఆర్ కాలనీ నుండి బిల్లుపాడు రహదారి పూర్తి చేయాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దుండేటి వీరారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుల దీవెల కృష్ణయ్య , మాజీ జెడ్పిటిసి మూకర ప్రసాద్, అన్నారుగూడెం మాజీ ఎంపీటీసీ తాళ్ళ జోసఫ్, తదితరులు పాల్గొన్నారు.

# అజ్ఞానాన్ని పారద్రోలే ఏకైక ఆయుధం విద్య

**పద్మశ్రీ మహాసహస్ర అవధాని గరికపాటి**

**యస్.బి.ఐ.టి లో ఆకట్టుకున్న ఓరియన్‌టేషన్ ప్రోగ్రాం**

**ఆలోచింపచేసిన గరికపాటి సలహాలు సూచనలు**





**ఖమ్మం, ప్రతినిధి ఆగష్టు17 (పిసిడబ్ల్యు న్యూస్):** గురువులను, తల్లిదండ్రులను గౌరవించటం విద్యార్థులు అలవరుచకోవాలని పద్మశ్రీ పురస్కార గ్రహీత, మహాసహస్ర అవధాని గరికపాటి నరసింహారావు తెలిపారు. సోమవారం స్థానిక యస్.బి.ఐ.టి. కళాశాలలో నిర్వహించిన మొదటి సంవత్సర విద్యార్థుల ఓరియంటేషన్ ప్రోగ్రాంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న గరికపాటి తల్లిదండ్రులు గురువుల ప్రాముఖ్యతను గురించి విద్యార్థులకు అవగాహన కలిగించారు. విద్యార్థులు ఫోన్లు, టెలివిజన్ వంటి వ్యాపకాలు మాని వారంలో 2 రోజులు డిజిటల్ ఉపవాసం అలవర్చుకోవడం ద్వారా విద్యపై దృష్టిని కేంద్రీకరించగలమని వెల్లడించారు. మోయలేని భారం వల్లనే ఒత్తిడి పెరుగుతుందన్నారు. గురువులతో చర్చించడంతో ఎలాంటి ఒత్తిడినైనా జయించవచ్చని వారు తెలిపారు. విద్యను అభ్యసిస్తూనే దేశ అభివృద్ధి గురించి ఆలోచించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గరికపాటి విద్యార్థులతో ముఖాముఖి చర్చించి వారితో ప్రశ్నోత్తరాలలో పాల్గొన్నారు. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ యస్.బి.ఐ.టి. లో ఉన్నత మైన విద్యా ప్రమాణాలు పాటించటంతో పాటు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించటంలో నిర్విరామంగా కృషి చేస్తున్నామని, కళాశాల పొందిన న్యాక్ ఎ ప్లస్ గ్రేడ్ మరియు యు.జి.సి అటానమస్ హోదా దీనికి నిదర్శనం అని, ఈ విద్యా సంవత్సరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 100 శాతం అడ్మిషన్‌లు కలిగిన కళాశాలగా నిలవటం ఎంతో గర్వనీయమని ఇది మా కళాశాలపై భాద్యతను పెంచిందని, తల్లిదండ్రుల నమ్మకానికి అనుగుణంగా విద్యార్థులు అభివృద్ధి చెందేందుకు తాము సాయశక్తుల కృషి చేస్తామని వెల్లడించారు. మన దేశంలో ఏటా 15 లక్షల మంది ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేస్తుండగా కేవలం 1.5 లక్షల మంది మాత్రమే ఉద్యోగాలు పొందుతున్నారని మిగిలిన వారు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని, ఈ పరిణామాలకు అనుగుణంగా మా విద్యార్థులకు కోడింగ్, రీజనింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ మొదలగు శిక్షణా కార్యక్రమాలను, ఇంటర్న్‌షిప్స్, ఫస్ట్ ఇయర్ నుంచే నిర్వహిస్తున్నామని తద్వార బహుళజాతి కంపెనీలలో అత్యధిక ప్లేస్‌మెంట్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి. ధాత్రి విశ్లేషించారు. విలువలతో కలిగిన విద్యనందించటంలో తమ కళాశాల అహర్నిసలు కృషి చేస్తుందని కళాశాల వైస్- ఛైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. విద్యార్థులు పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక విప్లవమైన ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, డేటా సైన్స్ మొదలగు రంగాలలో ఆసక్తిని పెంచుకొని నైపుణ్యాలను పెంచుకోవటంలో ధృడ సంకల్పం కలిగి ఉండాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రాజ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రుల తో పాటు కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎ.వి.వి. శివ ప్రసాద్, హెచ్.ఒ.డిలు, కె. అమిత్ భింద్వాజ్, టి. చరణ్ సింగ్, కె. స్ఫూర్తి, యమ్. సుప్రియ మీనన్, యమ్. పద్మావతి పాల్గొన్నారు.

# గుర్తూరు ప్రాథమిక పాఠశాలలో నూతనంగా వివి మరియు ఆయా నియామకం

- **మీ ఇంట్లో ఉన్న చిన్నపిల్లలను ప్రాథమిక పాఠశాలలో చేర్పించండి**
- **ప్రధానోపాధ్యాయులు తిరుమలేష్ వెల్లడి**






**తొర్రూరు ప్రతినిధి ,ఆగస్టు 17(పిసీడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని గుర్తురు గ్రామపంచాయతీలో గల ప్రాథమిక పాఠశాలలో పాఠశాల ప్రారంభం నుండి ఒక ఉపాధ్యాయ సీటు ఖాళీగా ఉంది. గత సంవత్సరం వంద మంది విద్యార్థుల లోపు ఉండటంతో ఉపాధ్యాయులు నియామకం జరగలేదని అన్నారు. ఈ విద్యా సంవత్సరం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 100కు పైగా పెరగడంతో ఒక ఉపాధ్యాయ సీటు ఖాళీగా ఉన్నందున ఆ సీటు భర్తీ చేసేందుకు గతంలో జరిగిన గ్రామసభలో గ్రామ సర్పంచ్ కవితా బాలకృష్ణ దృష్టికి ప్రధానోపాధ్యాయులు తిరుమలేష్ తీసుకెళ్లారు. చిన్నపిల్లలను చూసుకునేందుకు ఆయా కూడా లేకపోవడంతో విద్యార్థుల ను తల్లిదండ్రులు ఎవరు పాఠశాలకు పంపించకపోవడం జరిగింది గత రెండు రోజుల క్రితం జరిగిన స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో గ్రామానికి చెందిన పంజాల అశ్విని (విద్యా వాలంటరీ) తోపాటు ఆయాగా ఈదునూరి గౌతమి గ్రామ సర్పంచ్ కవితా బాలకృష్ణ ఆధ్వర్యంలో నియమితులైనట్లు ప్రధానోపాధ్యాయులు ప్రకటించారు. ప్రధానోపాధ్యాయులు గ్రామస్తులందరికీ మీ ఇంట్లోని చిన్నపిల్లలను పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రి. ప్రైమరీ (నర్సరీ, ఎల్ కేజీ, యూకేజీ తరగతులు ప్రారంభించిన విషయం మీకు తెలిసిందే. పాఠశాలలో నూతనంగా నియమితులైన వారికి ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు స్వాగతించారు. ఈరోజు నుండి మాలో ఒకరిగా విద్యా బోధనలు చేస్తారని అన్నారు. నూతనంగా విద్యా వాలంటరీ తో పాటు ఆయా కూడా పాఠశాలలో చేరినందుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# పెన్షనర్ల సమస్యలపై రాజీలేని పోరాటం

**- ఈహెచ్ఎస్ అమలుపై ప్రభుత్వ నిర్లక్ష్యమేంటి?**

**- మూడు నెలలుగా 1.5 శాతం కోత.. అందని వైద్య సేవలు**

**- వారంలోగా పరిష్కారం చూపాలి.. లేకుంటే 33 జిల్లాల్లో ఆందోళనలు**

**- ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు పేర్ని వెంకట్‌రెడ్డి**












**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జీవితంలోని విలువైన సంవత్సరాలను ప్రభుత్వ సేవకు అంకితం చేసి, పదవీ విరమణ అనంతరం ప్రశాంతంగా జీవించాల్సిన పెన్షనర్లు తమ న్యాయమైన హక్కుల కోసం మరోసారి ఉద్యమ బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పేర్ని వెంకట్‌రెడ్డి అన్నారు. పెన్షనర్ల ఆరోగ్యం, ఆర్థిక భద్రత, సంక్షేమం విషయంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.ఖమ్మంలోని పెన్షనర్స్ భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు ఎం. సుబ్బయ్య అధ్యక్షతన సోమవారం పెన్షనర్ల సర్వసభ్య సమావేశం, పంచాయతీరాజ్ రిటైర్డ్ పెన్షనర్ల సంఘం విలీన సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పేర్ని వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ... ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) అమలుపై రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల తీరును తీవ్రంగా తప్పుబట్టారు."తాంబూలాలు ఇచ్చాం.. తన్నుకు చావండి" అన్న చందంగా ప్రభుత్వ వ్యవహారశైలి ఉందని వారు విమర్శించారు. జీవోలు జారీ చేయడంతోనే తమ బాధ్యత పూర్తయిందన్నట్లుగా ప్రభుత్వం, అధికారులు వ్యవహరిస్తున్నారని అన్నారు. క్షేత్రస్థాయిలో పథకం అమలవుతుందా? పెన్షనర్లకు వాస్తవంగా వైద్య సేవలు అందుతున్నాయా? అనే విషయాలను పట్టించుకోకపోవడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు.పెన్షనర్ల నుంచి గత మూడు నెలలుగా క్రమం తప్పకుండా 1.5 శాతం మొత్తాన్ని మినహాయిస్తున్నప్పటికీ, ఈహెచ్ఎస్ పూర్తిస్థాయిలో ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుందో స్పష్టత లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆసుపత్రుల జాబితాలోని మెజారిటీ ఆసుపత్రుల్లో ఆరోగ్య పథకం అమలు కావడం లేదని తెలిపారు.వృద్ధాప్యంలో అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు ఆసుపత్రి ఖర్చులు భరించలేక పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. జీవితాంతం ప్రభుత్వానికి సేవ చేసిన వారికి వృద్ధాప్యంలో వైద్య భద్రత కల్పించడం దయ కాదు.. వారి హక్కు, ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.పీఆర్సీ ప్రకటించకపోవడం, డీఏలు విడుదల చేయకపోవడం, రెండేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల ప్రయోజనాలను పూర్తిగా చెల్లించకపోవడం పట్ల నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చేస్తున్న ప్రకటనలు కార్యరూపం దాల్చకుండా కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నాయని విమర్శించారు. ఈ వారంలోగా పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఈ నెల చివరి వారంలో రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రాష్ట్ర నాయకత్వం హెచ్చరించింది. **విలీనంతో పెరిగిన ఐక్యత.. హక్కుల పోరాటానికి మరింత బలం** ఈ సందర్భంగా పంచాయతీరాజ్ టీచర్స్ పెన్షనర్ల సంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘంలో విలీనం చేస్తున్నట్లు ఏకగ్రీవంగా ప్రకటించారు. పెన్షనర్ల హర్షధ్వానాల మధ్య జరిగిన ఈ విలీనంతో రిటైర్డ్ ఉద్యోగుల హక్కుల ఉద్యమానికి మరింత బలం చేకూరింది.ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు పేర్ని వెంకట్‌రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుంకర భిక్షంగౌడ్, మోతుకూరి మధు, ఎలమంచి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్‌రావు, పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దువాకుల వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వేణు, రాష్ట్ర నాయకులు వజ్రా శ్రీనివాసరావు, వెంకటనారాయణ తదితరుల సమక్షంలో విలీన ప్రక్రియ ఘనంగా జరిగింది. రాష్ట్ర బాధ్యులుగా వై. వెంకటేశ్వర్లు, జిల్లా బాధ్యులుగా కొండలరావు, సీతారామయ్య, చల్లా శ్రీనివాస్‌లను నియమించాలని సమావేశంలో నిర్ణయించారు. **ఐక్యంగా నిలుద్దాం.. హక్కులను సాధించుకుందాం** పెన్షనర్ల సమస్యలు కేవలం కొద్దిమంది వ్యక్తుల సమస్యలు కావని, ప్రభుత్వానికి సంవత్సరాల తరబడి సేవలందించిన వేలాది కుటుంబాల జీవితాలకు సంబంధించినవని సంఘం నాయకులు పేర్కొన్నారు. అందుకే రానున్న ఉద్యమాన్ని ప్రతి సభ్యుడు తన సొంత బాధ్యతగా భావించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. "మన హక్కుల కోసం మనమే గళమెత్తాలి.. మన ఆరోగ్య భద్రత కోసం మనమే ఐక్యంగా నిలవాలి.. మన భవిష్యత్ తరాలకు గౌరవప్రదమైన పెన్షనర్ జీవితం అందించేందుకు మన ఉద్యమాన్ని విజయవంతం చేయాలి" అని విజ్ఞప్తి చేశారు. సంఘం చేపట్టే ప్రతి కార్యక్రమానికి సభ్యులు సంపూర్ణ సహకారం అందించి, శాంతియుతంగా, ఐక్యంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. పూర్ణచందర్‌రావు, ఆర్. దుర్గాదేవి, కార్యదర్శులు టీ. జనార్దన్ రావు, ఖాజా మోహినుద్దీన్, జానయ్య, సుగుణ, రాజేంద్రన్, కృష్ణారెడ్డి, సి. బాబురావు, రమణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

---

# కురవి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ

**ప్రతి పిటిషన్‌ను నిర్ణీత సమయంలో పరిశీలించి పరిష్కరించాలి**

**నేరాల దర్యాప్తులో సీసీటీవీ ఫుటేజీని సమర్థవంతంగా వినియోగించుకోవాలి: జిల్లా ఎస్పీ డా. శబరీష్,**






**కురవి, ఆగస్టు 17(పి.సి.డబ్ల్యూ న్యూస్):** జిల్లా ఎస్పీ డా. శబరీష్, సోమవారం కురవి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ గదులు, రికార్డులు, సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలించారు.ముందుగా రిసెప్షన్ విభాగాన్ని పరిశీలించిన ఎస్పీ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజల పిటిషన్లు, వాటి పరిష్కార స్థితి, పెండింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి, ఎలాంటి అనవసర జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.పోలీస్ స్టేషన్‌లోని సి సి టి ఎన్ ఎస్ 2.0, స్టేషన్ రైటర్ విభాగం, ఇతర రికార్డులు పరిశీలించిన ఎస్పీ, సిబ్బందిని విధులకు సంబంధించిన పలు అంశాలపై ప్రశ్నించి వారి పనితీరును సమీక్షించారు. కేసులు,టి ఎన్ ఎస్ పిటిషన్లు, స్టేషన్‌కు సంబంధించిన సమాచారాన్ని సి సి 2.0లో ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేసి అప్‌డేట్ చేయాలని సూచించారు.సీసీటీవీ కెమెరాల పనితీరు, కవరేజ్, రికార్డింగ్ పరిస్థితిని పరిశీలించి, సీసీటీవీలను నిరంతరం పర్యవేక్షిస్తూ సక్రమంగా పనిచేసేలా చూడాలని సూచించారు. నేరాల నియంత్రణ, నేరాల దర్యాప్తులో సీసీటీవీ ఫుటేజీని సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు.అనంతరం జనరల్ డైరీ, స్టేషన్ రికార్డులు, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, పాయింట్ బుక్స్ తదితరాలను పరిశీలించారు. అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసి, పూర్తిస్థాయిలో నిర్వహించాలని కురవి ఎస్ఐ సతీష్‌కు సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేకంగా సమీక్షించిన ఎస్పీ డా. శబరీష్, , కురవి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాలు, బ్లాక్ స్పాట్ల వివరాలను ఎస్ఐ సతీష్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో పర్యవేక్షణ పెంచి, వాహనదారులకు అవగాహన కల్పించాలని సూచించారు.మాదకద్రవ్యాల నియంత్రణపై కూడా ఎస్పీ ప్రత్యేకంగా సమీక్షించారు. గంజాయి బీటర్ల వివరాలను సేకరించి, వారిపై నిరంతరం నిఘా ఉంచాలని, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.విలేజ్ పోలీస్ ఆఫీసర్స్ (వి పి వో స్) ద్వారా గ్రామాల్లో పోలీసుల నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఎస్పీ సూచించారు. వి పి వో లు తమకు కేటాయించిన గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ, గ్రామాల్లోని పరిస్థితులు, నేరాలకు సంబంధించిన సమాచారం, గంజాయి మరియు ఇతర అక్రమ కార్యకలాపాలపై సమాచారాన్ని సేకరించి పోలీస్ స్టేషన్‌కు అందించాలని తెలిపారు.గ్రామాల సందర్శనలు, 100 మరియు 112 ద్వారా వచ్చే కాల్స్, ప్రజల పిటిషన్లపై తీసుకుంటున్న చర్యల వివరాలను కూడా ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పోలీసుల నిరంతర పర్యటనలు కొనసాగిస్తూ, ప్రజలతో సమన్వయం పెంచుకోవాలని సూచించారు.ప్రజావాణి పిటిషన్ల విషయంలో ఎలాంటి పెండెన్సీ ఉండకూడదని, ప్రతి పిటిషన్‌ను నిర్ణీత సమయంలో పరిశీలించి పరిష్కరించాలని ఎస్పీ స్పష్టం చేశారు.ప్రజలకు మరింత సమర్థవంతమైన పోలీస్ సేవలు అందించేందుకు సిబ్బంది బాధ్యతాయుతంగా, అప్రమత్తంగా,నిర్లక్ష్యానికి తావులేకుండా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్, సూచించారు.

---

# అక్షరానికి ఆకలి వేస్తే... భవిష్యత్తు భారమవుతుంది!






**- స్కాలర్‌షిప్ దానం కాదు, విద్యార్థుల హక్కు**

**- మంత్రుల క్యాంప్ కార్యాలయాల వద్ద పి.డి.యస్.యు ఉద్రిక్త నిరసన**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** విద్య అనేది పేదవాడి బ్రతుకును మార్చే ఒకే ఒక్క మార్గం. కానీ, నేడు ఆ చదువును కొనసాగించడమే పేద విద్యార్థులకు ఒక గగన కుసుమంగా మారింది. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్లు అంటే పాలకులు ఇచ్చే దానధర్మాలు కావు... అవి పేద బిడ్డల చదువుల భవిష్యత్తుకు వేసే పునాదులు! ఆ పునాదులను నిలబెట్టుకోవడానికి, తమ న్యాయమైన హక్కుల సాధన కోసం విద్యార్థి లోకం పడుతున్న ఆవేదన నేడు ఖమ్మం నేలను తాకింది.ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పి.డి.యస్.యు కమిటీల ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుల క్యాంప్ కార్యాలయాల ఎదుట విద్యార్థులు చేపట్టిన నిరసన కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. తమకు రావాల్సిన రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని "మా స్కాలర్‌షిప్ మా హక్కు" అంటూ విద్యార్థులు చేసిన నినాదాలు మిన్నంటాయి. పోలీసులు ఈ ఆందోళనను విచ్ఛిన్నం చేసి, పి.డి.యస్.యు రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ, ఖమ్మం జిల్లా అధ్యక్షులు టి. లక్ష్మణ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మునిగల శివ ప్రశాంత్ సహా పలువురు విద్యార్థి నాయకులను అదుపులోకి తీసుకున్నారు.ఈ సందర్భంగా పి.డి.యస్.యు రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ మాట్లాడుతూ, ప్రభుత్వాలు స్కాలర్‌షిప్‌లను కేవలం ఒక సంక్షేమ పథకంగా చూస్తూ నిర్లక్ష్యం చేస్తున్నాయే తప్ప, దాని వెనుక ఉన్న సామాజిక బాధ్యతను మరచిపోతున్నాయని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.చదువుకు మూతపడుతున్న తలాపులు: రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడంలో పాలకుల ఆలస్యం వల్ల ఇంజనీరింగ్, మెడికల్, ఫార్మసీ, డిగ్రీ, ఇంటర్ విద్యార్థులు పరీక్ష ఫీజులు, పుస్తకాలు, హాస్టల్, ప్రయాణ ఖర్చులు చెల్లించలేక తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. **పెరుగుతున్న డ్రాపౌట్స్:** చేతిలో డబ్బులు లేక, ఉన్నత చదువులకు వెళ్లలేక ఎంతోమంది పేద విద్యార్థులు సగంలోనే చదువును ఆపేస్తున్నారంటే అది ఈ సమాజానికి, పాలక వ్యవస్థకు పెద్ద మచ్చ. **కోర్టు ఆదేశాల బేఖాతరు :** ఆఖరికి అత్యున్నత న్యాయస్థానాలు సైతం విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్ తక్షణమే చెల్లించాలని ఆదేశించినా, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం సోయి లేకుండా వ్యవహరించడం శోచనీయం. కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ రూ. 10 వేల కోట్ల బకాయిలను నిలిపివేయడం పేద విద్యార్థుల భవిష్యత్తుకు గొడ్డలిపెట్టుగా మారింది. **విద్యార్థి లోకానికి విజ్ఞప్తి:** హక్కుల సాధన పోరాటంలో అడుగులో అడుగు వేద్దాం! చదువు అనేది ఒక్కరి స్వయంకృషి మాత్రమే కాదు... సమాజపు పురోగతికి మూలస్తంభం. ఏ ఒక్క పేద బిడ్డ కూడా డబ్బులు లేక చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో జరుగుతున్న ఈ పోరాటం కేవలం విద్యార్థి సంఘాలది మాత్రమే కాదు, ఇది మన ఇంట్లో పిల్లల భవిష్యత్తు కోసం జరుగుతున్న ధర్మపోరాటం.ప్రభుత్వాలు ఎంత అణచివేసినా, బకాయిలు విడుదల చేసే వరకు ఈ ఆందోళన విశ్రమించదు. మన హక్కులను కాలరాస్తున్న పాలకుల తీరును ఎండగట్టడానికి, పెండింగ్‌లో ఉన్న రూ. 10 వేల కోట్లను తక్షణమే విద్యార్థుల ఖాతాల్లో వేసేలా ఒత్తిడి తెచ్చేందుకు విద్యార్థులు, మేధావులు, తల్లిదండ్రులు, ప్రజలందరూ ఈ పోరాటానికి పూర్తి మద్దతుగా నిలవాలని, విద్యార్థుల హక్కుల సాధన ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పి.డి.యస్.యు నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ నిరసనలో పి.డి.యస్. యు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు బుర్ర వీరభద్రం, నాయకులు సురేష్, హరిచంద్ర ప్రసాద్, రఘు, రామ్ చరణ్, మురళి, మనోజ్, సుశాంత్, గోపి, రాకేష్ తదితరులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

---

# ఆపదలో ఆపద్బాంధవుడు ఎన్‌ఆర్‌ఐ తోట సత్యం..



**రామడుగు, 17 ఆగస్టు (పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండల కేంద్రానికి చెందిన అనుపురం లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం వారి కుటుంబ సభ్యులు అనుపురం లావణ్య, శ్రీనివాస్ మా దృష్టికి తీసుకురావడం జరిగింది.ఈ విషయాన్ని వెంటనే ఎన్నారై తోట సత్యం దృష్టికి తీసుకెళ్లగా, లక్ష్మి కుటుంబ పరిస్థితులను తెలుసుకుని మానవతా దృక్పథంతో స్పందించారు. వారి సూచన మేరకు నాగి శేఖర్ , సముద్రాల శ్రీనివాస్ ద్వారా రూ.10,000/- ఆర్థిక సహాయం అందించారు. ఈ ఆపద సమయంలో తమ కుటుంబానికి అండగా నిలిచిన తోట సత్యం కు అనుపురం లక్ష్మి కుటుంబ సభ్యులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.